


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 205 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 31 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :205 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 31 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్


- తన వద్ద రూ.2 లక్షలు, భార్య వద్ద రూ.1 లక్ష నగదు రూపంలో ఉన్నట్లు వెల్లడి
- బీఎండబ్ల్యూ, టయోటా కార్లు ఉన్నట్లు తెలిపిన విజయ్
- రూ.1.20 కోట్ల విలువైన బంగారం ఉందని పేర్కొన్న విజయ్



- మిగతా2లో

## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు, రికార్డు చేయవు

- వస్తువులను చూడటం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన అవుతుందన్న మంత్రి
- లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు వెల్లడి
- లాకర్లలోని వస్తువులను విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం కుదరదని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:వినియోగదారులు లాకర్లలో ఉంచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడలేవని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వాటిని చూడటం లేదా రికార్డు చేయడం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. బ్యాంకు లాకర్లలో

- మిగతా2లో

## కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారింది



- సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందన్న పేర్ని నాని
- బోరు వేయాలన్నా రూ. 50 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపణ
- బాధితుల పక్షాన పోరాడతామని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందని

- మిగతా2లో

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

- తిరుమలలో కాస్త తగ్గిన భక్తుల తాకిడి
- శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం
- 10 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న 80,774 మంది
- రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం



- మిగతా2లో

## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- టీడీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్
- సోషల్ మీడియా ద్వారా స్పందించిన చంద్రబాబు
- కూటమి ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్న సీఎం
- గత 20 నెలల పాలనే మన ఐక్యతకు నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ఐక్యతా స్ఫూర్తి పదికాలాలు కొనసాగాలని ఆకాంక్ష



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ., "రాష్ట్ర అభివృద్ధి,

- మిగతా2లో



## తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా..

**సూత్రధారి, పాత్రధారి నారా లోకేశ్**

- తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల భూమిని రూ. 94 కోట్లకే అప్పగించారన్న భూమన
- బహిరంగ ప్రకటన కూడా లేకుండానే భూమిని దోచిపెట్టారని మండిపాటు
- వందల కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:తిరుపతిలో సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కూటమి ప్రభుత్వం కారుచౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతోందని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారానికి మంత్రి నారా లోకేశ్ సూత్రధారి,

- మిగతా2లో

# డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

- నాయుడుపేటలో ఇళ్ల పంపిణీ... ఓ ఇంటికి గుమ్మడికాయ కట్టిన సీఎం చంద్రబాబు...
- రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం
- నాయుడుపేటలో లబ్ధిదారులతో కలిసి ఇళ్లలోకి ప్రవేశించిన సీఎం చంద్రబాబు
- హిందూ లబ్ధిదారు ఇంటిలో సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ముస్లిం కుటుంబంతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన చంద్రబాబు
- కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు పాల్గొన్నారు







పెన్ పవర్ డెస్క్:రాష్ట్రవ్యాప్తంగా పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన 2.5 లక్షల టిడ్కో ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం సోమవారం పండుగ వాతావరణంలో జరిగింది. తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొని ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన లబ్ధిదారులతో కలిసి వారి కొత్త ఇళ్లలోకి ప్రవేశించి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి, లబ్ధిదారురాలైన ముక్కర అంబిక ఇంటికి వెళ్లి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రతంలో కూర్చుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం, మరో లబ్ధిదారురాలైన షేక్ నూరి ఇంటికి వెళ్లారు. అక్కడ వారి సంప్రదాయం ప్రకారం జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. నూరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారిని ఆశీర్వదించారు.ఒకే వేదికపై హిందూ, ముస్లిం లబ్ధిదారుల ఇళ్లలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొనడం

- మిగతా2లో

## ఏపీ పోలీసుల ముందు లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

- పోలీసుల ముందు లొంగిపోయిన మావో నేత చెల్లూరు నారాయణరావు అలియాస్ సోమన్న
- ఏవోబీ ప్రాంతంలో దశాబ్దాల పాటు ఆయనది కీలక పాత్ర
- మావోయిస్టుల లొంగుబాటుకు రేపటితో ముగుస్తున్న డెడ్ లైన్

పెన్ పవర్ డెస్క్: దేశవ్యాప్తంగా మావోయిజం నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న వేళ, మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆంధ్రా-ఒడిశా బోర్డర్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న చెల్లూరు నారాయణరావు

- మిగతా2లో



## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది: కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

- కేరళ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు
- పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశంపై మోదీ ఎందుకు మాట్లాడలేదన్న రాహుల్
- అవినీతి ఆరోపణలు ఉన్న విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్న

- మిగతా2లో




## హర్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

### ఇరాన్ కు ట్రంప్ తాజా వార్నింగ్

- హర్మూజ్ జలసంధిని తెరవకపోతే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- ఖర్గ్ దీవి సహా కీలక చమురు, విద్యుత్ కేంద్రాలను ధ్వంసం చేస్తామని అల్టిమేటం
- చర్చల్లో పురోగతి ఉందని చెబుతున్న ట్రంప్.. అలాంటివేమీ లేవంటున్న ఇరాన్
- మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక మోహరింపుతో పెరుగుతున్న ఉద్రిక్తతలు

- మిగతా2లో



## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్.. రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- దేశవ్యాప్తంగా మరో 11 విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రి కేఫ్‌లు ప్రారంభం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా వర్చువల్ ప్రారంభోత్సవం
- ఈ కేఫ్‌లలో రూ.10కే టీ, వాటర్ బాటిల్, రూ.20కే స్నాక్స్
- స్థానిక రుచులకు ప్రాధాన్యత.. ప్రయాణికుల నుంచి ప్రశంసలు



పెన్ పవర్ డెస్క్:విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు

- మిగతా2లో




## దక్షిణ భారతంపై ఢిల్లీ పెత్తనం

భారతదేశం అనేది రాష్ట్రాల కలయికతో ఏర్పడిన ఒక సమాఖ్య. కానీ, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి ఆ సమాఖ్య పునాదులను పెకిలించి, దేశాన్ని ఒకే రంగు, ఒకే భాష, ఒకే అధికార కేంద్రం కిందకు తెచ్చేందుకు ప్రమాదకరమైన వ్యూహాలను అమలు చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల లేవనెత్తిన అంశాలు కేవలం రాజకీయ విమర్శలు కావు; అవి దక్షిణాది అస్తిత్వంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా వినిపించిన హెచ్చరికలు. ఆర్థికంగా దోపిడీ చేస్తూ, రాజకీయంగా గొంతు నొక్కే ఈ 'నయా సామ్రాజ్యవాద' ధోరణిని దక్షిణాదిలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులు ఐక్యంగా ఎదిరించాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది. దక్షిణాది రాష్ట్రాలు-తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ-దేశ అభ్యున్నతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దేశ భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 20 శాతం, జనాభాలో 19 శాతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు, దేశ జీడీపీలో ఏకంగా 30 శాతం పైగా వాటాను అందిస్తున్నాయి. అయితే, కేంద్ర పన్నుల పంపిణీలో మనకు జరుగుతున్న అన్యాయం విస్మయానికి గురి చేస్తోంది.

కర్ణాటక కేంద్రానికి రూపాయి పన్ను చెల్లిస్తే, తిరిగి పొందుతున్నది కేవలం 15 పైసలు మాత్రమే. తమిళనాడు చెల్లించే ప్రతి రూపాయికి 29 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయి. తెలంగాణ రూపాయికి దాదాపు 40 పైసల లోపే వాటా దక్కుతోంది. ఉత్తరప్రదేశ్, బీహార్ దీనికి భిన్నంగా, ఉత్తరప్రదేశ్ ఒక రూపాయి చెల్లిస్తే దాదాపు 2.70 రూపాయలు, బీహార్ ఏకంగా 7 రూపాయలకు పైగా తిరిగి పొందుతున్నాయి. అభివృద్ధి చెందినందుకు, జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష వేయడం ఏ రకమైన న్యాయం దక్షిణాది కార్మికుల చెమట, ఐటీ నిపుణుల మేధస్సుతో వస్తున్న సంపదను ఉత్తరాదిలోని బీజేపీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి మళ్లించడం ఒక రకమైన 'ఆర్థిక వలసవాదం' కాక మరేమిటి? 2026 తర్వాత జరగబోయే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాజకీయ అస్తిత్వాన్ని నాశనం చేసేలా ఉంది. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గుతుంది లేదా స్థిరంగా ఉంటుంది. అదే సమయంలో, జనాభా విస్ఫోటనం జరిగిన హిందీ రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరుగుతుంది. దీనివల్ల ఢిల్లీ పీఠాన్ని అధిరోహించడానికి దక్షిణాది మద్దతు అవసరం లేని పరిస్థితి ఏర్పడుతుంది. పార్లమెంటులో దక్షిణాది గళం బలహీనపడి, మన ప్రాంతీయ ప్రయోజనాలు పూర్తిగా విస్మరించబడతాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. బాధ్యతాయుతంగా వ్యవహరించిన రాష్ట్రాలను శిక్షించి, బాధ్యతారాహిత్యంగా ఉన్న ప్రాంతాలకు రాజకీయ అధికారం కట్టబెట్టడం 'ఆర్ఎస్ఎస్' మార్క్ అఖండ భారత వ్యూహంలో భాగం.

బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి కేవలం నిధులను మాత్రమే దోచుకోవడం లేదు; మన సంస్కృతిని, భాషను కూడా అణగదొక్కాలని చూస్తోంది. 'హిందీ-హిందూ-హిందుస్థాన్' అనే నినాదంతో దక్షిణాదిలోని విభిన్న భాషా అస్తిత్వాలను తుడిచివేయాలని చూస్తున్నారు. కేరళలో లౌకికవాదాన్ని, తమిళనాడులో ద్రవిడ ఆత్మగౌరవాన్ని, తెలుగు రాష్ట్రాల్లోని ప్రజాస్వామిక సంస్కృతిని విచ్ఛిన్నం చేసేందుకు మతపరమైన చిచ్చు పెడుతున్నారు. దక్షిణాదిలోని కేరళ, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాలు నేటికీ సెక్యులర్ విలువలకి కంచుకోటలు. అందుకే ఈ రాష్ట్రాలపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి లేవనెత్తిన నిధుల అంశం, స్టాలిన్ వినిపిస్తున్న భాషా హక్కుల గళం, పినరయి విజయన్ సాగిస్తున్న ఫెడరలిజం పోరాటం.. ఇవన్నీ ఇప్పుడు ఒకే వేదికపైకి రావాలి. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి దక్షిణాది ముఖ్యమంత్రులందరూ ఒకే గొంతుతో ఢిల్లీని నిలదీయాలి. ఇది కేవలం పాలకుల పోరాటం కాకూడదు. దక్షిణాదిలోని ప్రతి పౌరుడికి ఈ అన్యాయం గురించి తెలియాలి. మా నిధులు మాకే - మా హక్కులు మాకే అనే నినాదం మార్మోగాలి. కార్పొరేట్ శక్తులకు దేశ వనరులను కట్టబెడుతూ, రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి దక్షిణాది నుంచే అసలైన ప్రతిఘటన మొదలవ్వాలి. లెఫ్ట్, డెమొక్రటిక్, సెక్యులర్ శక్తులు ప్రజలను ఆర్గనైజ్ చేసి, ఒక భారీ 'సౌత్ ఇండియా ర్యాలీ' ద్వారా తమ సత్తా చాటాలి. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి దేశానికి గర్వకారణం కావాలి కానీ, అది మన బలహీనత కాకూడదు. ఢిల్లీ పీఠం దక్షిణాదిని శాసించడం కాదు, దక్షిణాది ప్రజాస్వామిక గళం ఢిల్లీని నియంత్రించే రోజు రావాలి. అది మన ఆత్మగౌరవ పోరాటం!

# ఏపీ పోలీసుల ముందు లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

- మొదటి పేజి తరువాయి
అలియాస్ సోమన్న ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ పరిణామం ఏవోబీ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికిని దాదాపు లేకుండా చేసినట్లయ్యిందని భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నారాయణరావు ప్రస్థానం పీపుల్స్ వార్ కాలం నుంచే ప్రారంభమైంది. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పలు కీలక హోదాల్లో పనిచేశారు. ఏవోబీ ప్రాంతంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంలో, రిక్రూట్‌మెంట్లు చేపట్టడంలో ఆయనది కీలక పాత్ర. అటవీ ప్రాంతంలో దశాబ్దాల కాలం పాటు గెరిల్లా పోరాటంలో ఆరితేరిన సోమన్న లొంగుబాటును ఏపీ డీజీపీ త్వరలోనే అధికారికంగా ధ్రువీకరించనున్నారు.గత ఏడాది కాలంగా ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దుల్లో భద్రతా బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ కగార్' మావోయిస్టుల కోటలను బద్దలు కొట్టింది. ముఖ్యంగా, 2026 మార్చి 31 (రేపు) నాటికి దేశంలో మావోయిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించిన లక్ష్యం దిశగా బలగాలు దూసుకుపోతున్నాయి. ఈ గడువు ముగియడానికి కేవలం కొన్ని గంటల ముందే అత్యంత కీలక నేత సోమన్న లొంగిపోవడం గమనార్హం.

# రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులను రూ.404.58 కోట్లుగా చూపించారు. అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తులు మొత్తం రూ. 4,04,58,57,196గా ఉంది. బ్యాంకు డిపాజిట్లు, పెట్టుబడులు, వాహనాలు, ఇతర చరాస్తులతో సహా ఆయన ఆర్థిక వివరాలను ఈ అఫిడవిట్‌లో వివరంగా పొందుపరిచారు. తన వద్ద నగదు రూపంలో రూ.2 లక్షలు, భార్య సంగీత వద్ద రూ.1 లక్ష ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, ఫిక్స్డ్ డిపాజిట్ల రూపంలో రూ.388 కోట్లు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద బీఎండబ్ల్యూ 530, బీఎండబ్ల్యూ ఐ7, టయోటా లెక్సస్ 350, టయోటా వెల్‌ఫైర్ వంటి ఖరీదైన కార్లతో పాటు ఇతర ఆటోమొబైల్స్, ద్విచక్ర వాహనాలు కూడా ఉన్నాయని పొందుపరిచారు. వాహనాల మొత్తం విలువ రూ.14.35 కోట్లుగా పేర్కొన్నారు.

తన వద్ద 883 గ్రాముల బంగారం, దాని విలువ రూ.1.20 కోట్లు ఉంటుందని వెల్లడించారు. రూ.15 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు వెల్లడించారు. తనవద్ద ఉన్న స్థిరాస్తుల్లో తాను కొన్నవాటితో పాటు, వారసత్వంగా వచ్చినవి కూడా ఉన్నాయని వెల్లడించారు. స్వయం ఉపాధి, వడ్డీ, ఆస్తుల నుంచి వచ్చే అద్దె తన ప్రధాన ఆదాయవనరు అని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 184.53 కోట్ల ఆదాయం ఆర్జించినట్లు విజయ్ పేర్కొన్నారు.

# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

తిరుమల కొండపై భక్తుల రద్దీ కాస్త తగ్గింది. సోమవారం కావడంతో భక్తుల తాకిడి సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ప్రస్తుతం 10 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు.నిన్న ఆదివారం (మార్చి 29) నాడు మొత్తం 80,774 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 27,447 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆదివారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది.

సాధారణంగా వారాంతాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండి, కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోతుంటాయి. అయితే, వారాంతం ముగియడంతో ప్రస్తుతం రద్దీ కాస్త అదుపులో ఉంది. భక్తులు తక్కువ సమయంలోనే దర్శనం చేసుకుంటున్నారు.

# ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది: కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ విమర్శల పదును పెంచారు. రాష్ట్రంలో అధికార ఎల్డీఎఫ్ (వామపక్ష కూటమి) - కేంద్రంలోని బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పత్తనంతిట్ట జిల్లా అదూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ... కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం వామపక్షాలతోనే కాకుండా, 'ఎల్డీఎఫ్-బీజేపీ' కూటమితో కూడా పోరాడుతోందని అన్నారు.పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల ఆలయ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నించారు. ఆలయ బంగారాన్ని కాజేశారన్న ఆరోపణలపై ప్రధాని మౌనం వహించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్నారు. కేవలం ఓట్ల కోసమే మోదీకి గుడులు, మతం గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు.కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం తన వంటి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, 36 కేసులు పెట్టి 55 గంటల పాటు విచారించాయని రాహుల్ గుర్తు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం పినరయి విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విజయన్ అవినీతి మరకల వల్లే మోదీ గుప్పిట్లో ఉన్నారని, అందుకే వామపక్ష ప్రభుత్వం 'కార్పొరేట్ నిధుల ప్రభుత్వం'గా మారిందని విమర్శించారు.

# హర్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌లోని ఖర్గ్ దీవితో సహా కీలకమైన చమురు బావులు, విద్యుత్ కేంద్రాలను పేల్చివేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలను పెంచింది.

ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్, ఇరాన్‌లోని కొత్త నాయకత్వంతో చర్చలు జరుపుతున్నామని, వాటిలో గణనీయమైన పురోగతి ఉందని తెలిపారు. అయితే, ఒప్పందం త్వరగా కుదరకపోయినా లేదా హర్మూజ్ జలసంధిని తెరవకపోయినా తీవ్ర చర్యలు తప్పవన్నారు. ఇరాన్‌లోని చమురు బావులు, విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు, ఇతర కీలక సౌకర్యాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఉద్దేశపూర్వకంగా వదిలేసిన మంచినీటి డీశాలినేషన్ ప్లాంట్లను కూడా లక్ష్యంగా చేసుకునే అవకాశాలున్నాయని సంకేతాలిచ్చారు. గత 47 ఏళ్ల ఇరాన్ పాలనలో మరణించిన అమెరికా సైనికులకు ప్రతీకారంగానే ఈ చర్యలు ఉంటాయని ట్రంప్ స్పష్టం చేశారు.ఒకవైపు చర్చల్లో పురోగతి ఉందని ట్రంప్ చెబుతున్నప్పటికీ, మరోవైపు అమెరికా ఆ ప్రాంతంలో అదనపు సైన్యాన్ని మోహరిస్తోంది. దీనిపై ఇరాన్ పార్లమెంట్ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చర్చల పేరుతో అమెరికా దండయాత్రకు సిద్ధమవుతోందని వారు ఆరోపించారు. అయితే, అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగడం లేదని

ఇరాన్ నాయకులు ఖండించారు.

ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ సైనిక శక్తులు ఇటీవల నౌకాయానానికి దాదాపు మూసివేశాయి. గతంలో ఇరాన్ ఇంధన కేంద్రాలపై దాడులను 10 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించగా, ఆ గడువు ఏప్రిల్ 6తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు ప్రపంచ చమురు మార్కెట్లపై, మధ్యప్రాచ్య భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి.

# ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్.. రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- మొదటి పేజి తరువాయి
ఏర్పాటు చేసిన "ఉడాన్ యాత్రి కేఫ్"ల సేవలను మరింత విస్తరించింది. తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి.రాజ్‌కోట్ విమానాశ్రయం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ కేఫ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఉపయోగపడే పలు ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్‌లలో లక్నో, పాట్నా, రాజ్‌కోట్, జమ్మూ, శ్రీనగర్, జైపూర్, ఇండోర్ వంటి కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటితో పాటు డిజి యాత్ర, ఉచిత వైఫై సేవలు, ప్రయాణికుల కోసం ఉచిత గ్రంథాలయం 'ఫ్లైబ్రరీ', పిల్లల కోసం ప్రత్యేకంగా 'కిడ్స్ జోన్' వంటి సౌకర్యాలను కూడా ప్రారంభించారు. స్థానిక స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'అవ్సార్' (ూాబాూ=) ఔట్‌లెట్లను కూడా తెరిచారు.

### అందుబాటు ధరలు.. స్థానిక రుచులు

ఈ ఉడాన్ యాత్రి కేఫ్‌లలో ధరలు చాలా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా టీ రూ.10, వాటర్ బాటిల్ రూ.10, కాఫీ రూ.20, స్నాక్ రూ.20, స్వీట్ ఆఫ్ ది డే రూ.20కి లభిస్తుంది. ఈ కేఫ్‌ల మెనూలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల

స్థానిక రుచులకు ప్రాధాన్యత ఇవ్వడం. ఉదాహరణకు పుణె ఎయిర్‌పోర్టులో వడా పావ్, చెన్నైలో వడై, కోయంబత్తూరులో మెధు వడ వంటివి అందిస్తున్నారు. అయితే, దాదాపు అన్ని కేఫ్‌లలో సమోసా కామన్‌గా లభిస్తోంది.

ఇప్పటికే కోల్‌కతా, చెన్నై, పుణె, విజయవాడ, ఇటానగర్, భువనేశ్వర్, సూరత్, అహ్మదాబాద్, ముంబై, మంగళూరు, తిరువనంతపురం, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. తాజాగా మరో 11 చోట్ల వీటిని ప్రారంభించడంతో ప్రయాణికులపై భారం తగ్గనుంది.

# డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

- మొదటి పేజి తరువాయి
మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కొలుసు పార్థసారథి, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీ, పలువురు ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు, రికార్డు చేయవు

- మొదటి పేజి తరువాయి
భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ అంశంపై ఆమె మాట్లాడారు. వస్తువుల ఆధారంగా బీమా కవరేజీ ఉంటుందనే వాదనను ఆమె తోసిపుచ్చారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయని అన్నారు. లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కానీ లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీ చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని స్పష్టం చేశారు.

# పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి
ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు మీరు అందిస్తున్న సహకారం అభినందనీయం. నాకున్న అనుభవానికి తోడుగా, ఉత్తమ ఆకాంక్షలు, ఆదర్శాలు కలిగిన మీ వంటి ప్రజానేతలు కలిసివస్తే రాష్ట్రానికి, దేశానికి ఎంతటి మేలు జరుగుతుందో గత 20 నెలల పాలన ఒక నిదర్శనం" అని పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి పేర్కొన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిన తమ కూటమి ఐక్యతా స్ఫూర్తి ఇలాగే పదికాలాల పాటు కొనసాగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో పవన్ కల్యాణ్ వంటి నేతల పాత్ర కీలకమని, ఆయన తోడ్పాటుతో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకువెళతామని చంద్రబాబు తన సందేశంలో స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఉన్న సమన్వయం రాష్ట్రానికి శుభపరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు.

# కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారింది

- మొదటి పేజి తరువాయి
మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. మచిలీపట్నంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసిన ఆయన... ఆర్డీవో, ఎమ్మార్వోలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారిందని నాని ఆరోపించారు. "వందల ఎకరాలు ఉన్న బడా రైతులకు రెడ్ కార్పెట్ పరుస్తున్న అధికారులు... ఎకరం, అర ఎకరం ఉన్న చిన్న రైతులను మాత్రం పట్టిపీడిస్తున్నారు. చెరువు రిపేరు చేయాలన్నా రూ. 50 వేలు, బోరు వేయాలన్నా మరో రూ. 50 వేలు వసూలు చేస్తూ వికృత సంస్కృతికి తెరలేపారు" అని ధ్వజమెత్తారు.పెదపట్నం, కానూరు గ్రామాల్లో మడ అడవులను యథేచ్ఛగా నరికి చెరువులు తవ్వుతుంటే పట్టించుకోని అధికారులు, కోన గ్రామంలోని ఓ చిన్న రైతును రికార్డుల పేరుతో వేధించడం దారుణమన్నారు. 83 సెంట్ల భూమి ఉన్న రైతును ఆర్డీవో సాంబశివరావు నానా హైరానా పెట్టి, చెరువును పూడ్చాలని ఆదేశించడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. ముడుపుల మాయలో పడి చిన్న రైతుల పొట్ట కొట్టాలని చూస్తే సహించేది లేదని, బాధితుల పక్షాన పోరాడతామని పేర్ని నాని హెచ్చరించారు.

## తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా..

- మొదటి పేజి తరువాయి
పాత్రధారి అని ఆయన ఆరోపించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ ఆరోపణలు గుప్పించారు. తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల విలువైన భూమిని కేవలం 94 కోట్ల రూపాయలకే రెండు రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించారని భూమన ఆరోపించారు. "దివ్యశ్రీ రియల్ ఎస్టేట్ (బెంగళూరు), సైబర్ సిటీ డెవలపర్ (హైదరాబాద్) సంస్థలకు ఎటువంటి బహిరంగ ప్రకటన లేకుండానే భూములు దోచిపెట్టారు. ఈ సంస్థల్లో లోకేశ్ భాగస్వామిగా ఉన్నారా? లేక ఇవి ఆయన బినామీ సంస్థలా?" అని ప్రశ్నించారు. ఈ ఒప్పందం వెనుక సుమారు 300 నుంచి 400 కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరకు అమ్మడమే కాకుండా, సదరు సంస్థలకు అసాధారణ రాయితీలు కల్పించారని భూమన విమర్శించారు. 15 ఏళ్ల పాటు ఏపీ జీఎస్టీ ప్రోత్సాహకాలు, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్ కల్పించారని అన్నారు. ఐదేళ్ల పాటు ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. సాధారణంగా టూరిజం ప్రాజెక్టులను పీపీపీ విధానంలో ఇస్తారని, కానీ ఇక్కడ 'ఫ్రీ హోల్డ్' విధానంలో కట్టబెట్టడం వెనుక పెద్ద మతలబు ఉందని ఆరోపించారు.

ఎలాంటి అనుభవం లేని రియల్ ఎస్టేట్ సంస్థలకు వందల కోట్ల విలువైన భూములు కేటాయించడంలో ఆంతర్యమేమిటని భూమన ప్రశ్నించారు. తిరుపతి ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈ భూదందాను అడ్డుకుని తీరుతామని ఆయన హెచ్చరించారు.

# బడ్జెట్ అంచనాలపై సమీక్ష -- అభివృద్ధి పనులకు వేగం పెంచాలి

**జిల్లా ఇంచార్జ్ స్త్రీ శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి**







**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, మార్చి 30:**అల్లూరి సీతారామ రాజు జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరియు 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ అంచనాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం సోమవారం పాడేరు కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా ఇంచార్జి, స్త్రీ-శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాకు మొత్తం రూ.3,067.076 కోట్ల బడ్జెట్ అంచనాలు రూపొందించినట్లు తెలిపారు.అందులో అరకు నియోజకవర్గానికి రూ.1,545.823 కోట్లు, పాడేరు నియోజకవర్గానికి రూ.1,460.793 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేసి గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి నిధులను వినియోగించనున్నట్లు చెప్పారు. జిల్లాలో వ్యవసాయం, విద్య, వైద్యం, ఉద్యానవనం, శిశు సంక్షేమం, అంగన్వాడి తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. రైతు భరోసా, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, దీపం, శ్రీ శక్తి వంటి పథకాల అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ, వన్‌స్టాప్ సెంటర్ల సేవలు, మారుమూల ప్రాంతాల రహదారులు, డోలుమూత నివారణ వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు నేరుగా అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల మెరుగుదలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని ఆదేశించారు.విద్యార్థులకు మౌలిక సదుపాయాల్లో లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని, వేసవి సెలవుల అనంతరం స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో బడ్జెట్ ప్రణాళిక రూపొందించి రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమని శ్రీపూజ, సహాయ కలెక్టర్ కె. సాహెత్, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పెన్ పవర్ ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## శిర్లపాలెంలో శ్రీ రామాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహణ



ముఖ్య అతిథిగా సిరమ్మ పాల్గొనడంతో ఉత్సాహం

**బిమిలి, పెన్ పవర్, మార్చి 30 :** భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం మండలం శిర్లపాలెం గ్రామంలో సోమవారం శ్రీ రామాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ మహోత్సవానికి గ్రామస్థు లు, భక్తులు భారీగా హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొ న్నారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడి విజయనగ రం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆమె విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు.ఈ సందర్భంగా వేద పండితులు వేదమంత్రాల నడుమ సిరమ్మకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. కార్యక్రమం అంతా భక్తి పారవశ్యంలో సాగింది.

ఈ వేడుకలో ఆనందపురం మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, ఎంపీపీ ప్రతినిధి మజ్జి వెంకట్రావు, ఎస్. అప్పలరాజు, మాజీ సర్పంచ్ లు, వైఎస్ఆర్సిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే చిన్న శ్రీను సో ల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, సభ్యులు మరి యు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమా న్ని విజయవంతం చేశారు.

# పి-4 కార్యక్రమం ద్వారా సమసమాజ స్థాపన జరగాలి

**హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత**




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయనగరం. మార్చి 30:** పి-4 కార్యక్రమం ద్వారా సమసమాజ స్థాపన జరగాలని హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీరో పావర్టీ పి4 కార్యక్రమం తొలి వార్షికోత్సవ కార్యక్రమానికి హోం మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పి4 అనేది చాలా మంచి కార్యక్రమమని, ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని మంత్రి అనిత అన్నారు. సమాజంలో ఎన్ని కులాలు ఉన్నా అందులో ప్రజలను ధనిక, పేద వర్గాలుగా మాత్రమే ప్రపంచం చూస్తుందని, సమాజం లో పేదరికం నిర్మూలన జరగాలనేదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు. మానవసేవే మాధవసేవ అని ప్రతి ఒక్కరూ తోటివారికి సహాయం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో వనరులను సమర్థవంతంగా వినియోగించుకునే నాయకత్వం ఉందని, గతంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మభూమి, శ్రమదానం కార్యక్రమాలను అమలుచేయడం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో ఎన్నో గ్రామాల్లో పనులు చేపట్టి అభివృద్ధి సాధించినట్లు మంత్రి తెలిపారు. పి4 అంటే ప్రజలకు ఏదో ఒక విధంగా సహాయం చేయడమని,

ప్రజలకు సహాయం చేస్తే, మన స్థాయి అనేది మరింత పెరుగుతుందన్నారు. ఏ కార్యక్రమమైనా ప్రజల సహకారంతోనే విజయవంతం అవుతుందని, సమాజంలో ఎంతోమంది నిరాశ్రయులు, సహాయం కోసం ఎదురు చూసే వాళ్ళు ఉన్నారని, వారిని సంస్థలు, వ్యక్తులు మార్గదర్శులై దత్తత తీసుకొని పి 4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

ప్రస్తుతం జిల్లాలో 82426 బంగారు కుటుంబాలను గుర్తించగా వారిలో 19410 బంగారు కుటుంబాలను 2897 మార్గదర్శులు దత్తత తీసుకోవడం జరిగిందని, కార్యక్రమంలో భాగస్వాములైన అందర్నీ అభినందిస్తున్నట్లు తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకొని మరి కొంతమంది మార్గదర్శులు ముందుకు వస్తారని కోరుతున్నట్లు తెలిపారు.

## నకిలీ నేవల్ అధికారిగా మోసం -- నిందితుడికి 12 ఏళ్ల జైలు శిక




**గాజువాక :పెన్ పవర్ ,మార్చి 30 :**నేవల్ అధికారిగా నకిలీగా నటిస్తూ అమాయక ప్రజలను మోసం చేసిన వ్యక్తికి గాజువాక కోర్టు గట్టి శిక్ష విధించింది. నిందితుడు గాడి సత్య సూర్య చలపతి రావు అలియాస్ శశికాంత్‌కు గాజువాకలోని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వై. శ్రీలక్ష్మి 12 సంవత్సరాల కఠిన కారాగార శిక్షను ఖరారు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడు నేవీ యూనిఫాం ధరించి తనను నేవల్ అధికారిగా పరిచయం చేసుకుంటూ, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి పలువురు బాధితుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేశాడు. ఈ మోసాల కోసం నకిలీ ఐడీ కార్డులు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తయారు చేసినట్లు దర్యాప్తులో బయటపడింది.

ఈ ఘటనపై 2016లో న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.13/2016 కింద ఐ పి సి సెక్షన్లు 419, 420, 468, 471 ప్రకారం కేసు నమోదు చేశారు. అనంతరం విచారణకు హాజరు కాకపోవడంతో 2017లో నిందితుడిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేయబడింది. ఆ తరువాత పరారీలో ఉన్న నిందితుడిని 2025 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది.

కేసు విచారణలో సాక్ష్యాధారాలు, బాధితుల వాంగ్మూలాలు, స్వాధీనం చేసుకున్న నకిలీ పత్రాల ఆధారంగా నిందితుడిపై ఆరోపణలు రుజువయ్యాయి. దీంతో కోర్టు 12 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.30,000 జరిమానా విధించింది. అదనంగా బాధితులకు మొత్తం రూ.18.60 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, దర్యాప్తు అధికారి మరియు ప్రాసిక్యూషన్ అధికారులను విశాఖపట్నం నగర పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

## హుకుంపేటలో ఘనంగా విత్తనాల పండుగ.



**హుకుంపేట పెన్ పవర్ మర్చి 30:** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం హుకుంపేట మండల కేంద్రంలో ఇటుకుల పండుగ సందర్భంగా విత్తనాల పండుగను గిరిజనులు జరుపుకున్నారు. ఇటుకల పండుగ అనాది కాలం నుండి వస్తుందని ఇది కులమతాలకు అతీతంగా ప్రతి గిరిజనుడు ఈ పండుగను ఆచారంగా జరుపుకుంటారని గ్రామ పెద్దలు అన్నారు అంతేకాకుండా దేవుడికి ప్రార్థన చేసి ప్రత్యేకంగా పూజలు చేసి విత్తనాలకు పూజలు చేసి వాటిని నారు కింద వేస్తారు దాదాపు ఈ పండుగ ఒక వారం రోజులు ఘనంగా నిర్వహించుకుంటారు ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రామంలో ఉన్న వారందరూ ఇటుకల పండుగ చేస్తూ ఎటువంటి వ్యవసాయ పనులకు లేదా కూలి పనులకు వెళ్లకుండా కుటుంబ సభ్యులతో ఎంతో సంతోషంగా ఈ పండుగ జరుపుకుంటారు అనంతరం పండగ చివరి రెండు రోజులు ఇంట్లో ప్రతి పురుషుడు వేటకి వెళ్లి ఏదైనా జంతువును వేటాడి ఇంటికి తీసుకొని వచ్చేవారు అయితే ఇప్పుడు వేట మానేశారు ఇళ్లల్లో కోడి కోసుకొని పండగను నిర్వహించుకుంటారు ఇంట్లో ఉన్న ఆడవాళ్లు గ్రామం నడిబొడ్డున రోడ్డుకి అడ్డంగా తాడు కట్టి వచ్చి పోయే వారిని పండగ కానుక( తాన్చరి ) అడుగుతారు. ఎంతో సరదాగా నాటి వాడితో దింసా వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకుంటారు ఈ యొక్క కార్యక్రమంలో హుకుంపేట పిసా ప్రధాన కార్యదర్శి జన్ని వెంకటరమణ హుకుంపేట పీసా ప్రెసిడెంట్ కాసుల గోవింద్ వార్డు మెంబర్స్ బడ్నైని నూకరాజు. పండు చిన్న అప్పన్న గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జీకేవీధిలో ఎర్రని క్యాబేజీ సలాడ్‌లకు కొత్త రుచి

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 30:**సాధారణంగా ఆకుపచ్చగా ఉండే క్యాబేజీని ఎర్రగా పండించడం ఇప్పుడు జీకేవీధిలో ప్రారంభమైంది.బ్రాసికా ఓలేరేసియా శాస్త్రీయ నామం కలిగిన ఈ ఎర్రని క్యాబేజీ ఈశాన్య రాష్ట్రాల్లో పండుతుంది. జీకేవీధి మాలిగూడ గ్రామానికి చెందిన శంకర్, ఒరిస్సా నుంచి ప్రత్యేక విత్తనాలు తీసుకుని స్థానికంగా ఈ ఎర్రని క్యాబేజీ పండించారు. సోమవారం వీటిని విక్రయానికి తెచ్చారు.స్థానిక వ్యవసాయ వృత్తిపరులు మాట్లాడుతూ, ఈ ఎర్రని క్యాబేజీ ప్రత్యేకంగా సలాడ్ మరియు హోటల్ వంటకాల్లో ఎక్కువగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కొన్ని స్టార్ హోటల్స్ ఇప్పటికే ఈ కొత్త పంటను సప్లై చేసుకోవడం ప్రారంభించాయి.ఈ పంటతో స్థానిక రైతులు కొత్త మార్కెట్ అవకాశాలను పొందగలరని ఆశిస్తున్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# విజయనగరం జిల్లాలో హోం మంత్రి అనిత పర్యటన







- సబ్ జైల్, రూరల్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ
- రికార్డులను పరిశీలించిన హోం మంత్రి అనిత.

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మర్చి 30 :** విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా హోం మంత్రి అనిత స్థానిక సబ్ జైలు మరియు రూరల్ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో రికార్డులను పరిశీలించి, ఖైదీలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న భోజన సదుపాయాలను మంత్రి అనిత స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, సీసీ కెమెరాల పనితీరు మరియు మహిళా భద్రత కోసం పనిచేస్తున్న 'శక్తి టీమ్స్' పనితీరుపై సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ పర్యటనలో మంత్రి అనితతో పాటు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎస్పీ దామోదర్ పాల్గొన్నారు.

## అట్టహాసంగా కూర్మన్న పాలెం లో టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,మార్చి 29** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను 86వ వార్డు కూర్మన్నపాలెం కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. వార్డు పార్టీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, తర్వాత తెలుగుదేశం పార్టీ జెండాను వార్డు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ అన్న నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర రాజకీయాల్లో విశిష్టమైన ముద్ర వేసుకున్నారని అన్నారు. రాష్ట్ర క్షేమాభివృద్ధి కోసం సంక్షేమం కోసం నందమూరి తారక రామారావు ఎనలేని కృషి చేశారని తెలిపారు. పార్టీలో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా పార్టీ నిలుస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డ్ టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీనివాసరావు, వార్డు జనసేన అధ్యక్షుడు కాదా శీను,. జనసేన వార్డు సెక్రటరీ గంటల త్రినాథ్, వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి జగదీష్, ఉపాధ్యక్షులు రమేష్,గాజువాక తెలుగు యువత అధ్యక్షులు మనపురం గణపతి, బీసీ సెల్ అధ్యక్షులు సుబ్బయ్య,స్థానిక నాయకులు నాగేశ్వరావు, వెంకటేష్, రమణ రావు, అప్పలనాయుడు, తలారి రమణ, తలారి శ్రీను, సింహాద్రి, బాలకృష్ణ,సరస్వతి అప్పారావు,లవ్ బాబు, గంగాధర్,తాతాజీ, లోకేష్,లక్ష్మణరావు, గోవింద ప్రధాన్, బొబ్బిలి శ్రీను, అప్పలస్వామి,దయానంద్,బొడ్డేపల్లి అప్పారావు, తులసీరామ్, గుంపనలక్ష్మి, రుక్మిణి, రాధాకుమారి, లక్ష్మి, పావని, తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో పరిశ్రమలు అప్రమత్తంగా ఉండాలి

- ఫ్యాక్టరీల తనిఖీ అధికారి రాంబాబు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 30** : జిల్లాలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె. రాంబాబు సూచించారు. ముఖ్యంగా ఫార్మా, రసాయన పరిశ్రమల్లోని రియాక్టర్లు, స్టోరేజ్ ట్యాంకుల వద్ద ఉష్ణోగ్రతలు పెరగకుండా శీతలీకరణ వ్యవస్థలు నిరంతరం పనిచేసేలా చూడాలని యాజమాన్యాలను ఆదేశించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ల వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, ఎలక్ట్రికల్ ఆడిట్ నిర్వహించి పాత వైరింగ్‌ను తక్షణమే మార్చుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పని ప్రదేశాల్లో తగినంత గాలి వెలుతురుతో పాటు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని రాంబాబు పేర్కొన్నారు. అగ్నిమాపక పరికరాల పనితీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, అత్యవసర సమయాల్లో స్పందించేలా సిబ్బందికి మాక్ డ్రిల్స్ నిర్వహించాలని సూచించారు. భద్రతా నిబంధనలను అతిక్రమించి అజాగ్రత్తగా వ్యవహరించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన రామ్ మల్లిక్ నాయుడు.

**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 30.** చీపురుపల్లి మండలం పేరిపి గ్రామంలో చీపురుపల్లి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు భారీ ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, యువనేత శ్రీ కిమిడి రామ్ మాలిక్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం రామ్ మాలిక్ నాయుడు పశువులకు టీకాలు వేసే ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం రైతులకు ఉచితంగా మందుల కిట్‌లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రైతు కేవలం సాగుపైనే కాకుండా, అనుబంధ రంగమైన పశుపోషణపై కూడా ఆధారపడి జీవిస్తున్నాడు. అటువంటి పాడి రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని, వైద్య సేవలను చేరువ చేయడం చాలా అవసరం. చీపురుపల్లి మార్కెట్ కమిటీ వారు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని శిబిరాలు నిర్వహించి రైతులను ఆదుకోవాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రేగాన రామారావు, వైస్ చైర్మన్ వలి రెడ్డి శ్రీరాముల నాయుడు, చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రౌతు కామ నాయుడు, జనసేన నాయకులు విసనగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.




**నాతవరం,పెన్ పవర్ (మార్చి 30):** మండలం లో గల శృంగవరం జీడి తోటల వద్ద ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేయడం జరిగిందని ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు. వీరు వద్ద నుండి 3200 నగదును సీజ్ చేసి, కేసు నమోదు చేసి కోర్టుకు తరలించడం జరిగిందని అన్నారు.మండలంలో పేకాట ఆడిన, కోడిపందాలు నిర్వహించిన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు.



# చుక్క వలసలో పశువులకు టీకాలు.



**చీపురుపల్లి నియోజకవర్గం పెన్ పవర్ మార్చి 30.** చీపురుపల్లి నియోజకవర్గం చుక్కవలస గ్రామంలో పశు వైద్యాధికారుల బృందం ప్రతి పశువుకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో చుక్కవలస తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శనపతి సత్యన్నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు మేలు చేకూరాలని ఉద్దేశంతో ప్రతి గ్రామ గ్రామాన ప్రతి పశువుకు టీకాలు వేసే కార్యక్రమం చేపడుతుంది అని , రైతులందరూ తమ పశువులకు టీకాలను వేయించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చుక్కవలస వెటర్నరీ అసిస్టెంట్ శిరీష మరియు వారి బృందం , శనపతి శ్రీనివాస్ , శనపతి గొల్లయ్య , మోహన్ పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే పి ఫోర్ ప్రధాన లక్ష్యం... ఎమ్మెల్యే కళా వెంకట్రావు..

**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 30 ...** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో పేదరికం నిర్మూలించడం కోసమే ప్రత్యేకించి పి ఫోర్ కార్యక్రమాన్ని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అమల్లోకి తీసుకువచ్చారని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. సోమవారం నాడు పి ఫోర్ కార్యక్రమం చేపట్టి సంవత్సరం గడుస్తున్న నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయంలోని పి ఫోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి చేపట్టిన అభివృద్ధిని వివరించారు. పిఫోర్ ద్వారా ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో సుమారు 703 కుటుంబాల్ని గుర్తించమని, వారికి వారికి అవసరమైన సేవలను అందజేయుటకు డోనర్స్ ని కూడా ఎంపిక చేసామన్నారు. టీ 4 ద్వారా సేవలు అందజేత కొరకు నాలుగు మండలాల్లో 13214 మంది లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. అంతేకాకుండా చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో గృహ నిర్మాణాల పైన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఇప్పటికే 5490 మంది లబ్ధిదారులను గుర్తించి రానున్న మార్చి నాటికి గృహ నిర్మాణం పూర్తి చేసి అందజేయుటకు చర్యలు చేపట్టమన్నారు. దీనికి సంబంధించి సంబంధించిన బ్యాంకులకు అధికారులకు సూచనలు జారీ చేశామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శత శాతం నెరవేరుస్తూ ప్రజలకు మరింత చేరువవుతుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. అభివృద్ధి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా చంద్రబాబునాయుడు పరిపాలన



రాష్ట్రంలో కొనసాగుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ సారధ్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు. పి ఫోర్ ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి మెరుగైన సేవలు అందజేయుటకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజేశ్వరి, డిడిఓకే హేమ సుందర్, ఎంపీడీవో ఐ సురేష్, తాసిల్దార్ డీ ధర్మరాజు గృహనిర్మాణశాఖ అధికారులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కామ నాయుడు, దన్నాన రామచంద్రుడు, కే త్రిమూర్తుల రాజు, ముల్లు రమణ, రైతు నారాయణరావు చీపురుపల్లి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 4,286 గృహాల పంపిణీ



**విజయనగరం టౌన్, పెన్ పవర్,మార్చి 30:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో గృహ నిర్మాణ పథకం విజయవంతంగా కొనసాగుతోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన – హౌసింగ్ ఫర్ ఆల్ పథకంలో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా నిర్దేశించిన 2,50,893 ఇళ్ల నిర్మాణ లక్ష్యంలో భాగంగా సోమవారం జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేల చేతులమీదుగా లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లాలో ఈ ఏడాది మార్చి 30 నాటికి పూర్తి చేయాలని నిర్దేశించిన 4,286 గృహాల నిర్మాణాన్ని, జిల్లా గృహ నిర్మాణ సంస్థ 100 శాతం పూర్తి చేసింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను అందజేశారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో మంజూరైన ఇళ్లను, ఆయా నియోజవర్గ శాసనసభ్యులు లోకం నాగ మాధవి, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కిమిడి కళా వెంకటరావు, బేబీ నాయన, కోళ్ల లలితకుమారి చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మెన్లు, హౌసింగ్ అధికారులు, డివిజన్ హెడ్స్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పండగ తెచ్చిన ప్రమాదం..!

ధాంచారి కి కట్టిన తాడు ఆదమరిస్తే ఉరితాడే.





**హుకుంపేట పెన్ పవర్ మార్చి 30:** అల్లూరి సీతారామ జిల్లా హుకుంపేట మండలం రంగశిల గ్రామపంచాయతీ పరిధిలో గిరిజన సంప్రదాయ ఇటుకల పండగ ప్రారంభమైంది ఈ పండక్కు గిరిజన స్త్రీలు రోడ్డుకు తాడు కట్టి ఆపే ఆ రోడ్డుపై ప్రయాణిస్తున్న వారికి గిరిజన సాంప్రదాయ బొట్టుపెట్టి ఎంతోకొంత డబ్బులు అడుగుతారు. అయితే సోమవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల తాడు కట్టిన మహిళలు నీడలో విశ్రమించారు అటుగా ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు ఆ తాడును గమనించక తాడిని బలంగా ఢీకొన్నాడు అయితే ప్రమాదం నుంచి ఆ యువకుడు బయటపడ్డారు పట్టాం పంచాయతీ పట్టాం గ్రామస్తుడు కొర్ర ధర్మారావు అనే ఆ వ్యక్తికి తృటిలో పెను ప్రమాదమే తప్పింది హుకుంపేట మండలం లో ఇంటి కి సంబంధించిన ముడి సరుకుల కోసం వెళ్తూ మార్గమధ్యలో ఈ ప్రమాదం జరిగింది ధర్మారావు బైక్ పై వేగంగా వెళ్లడం వలన సన్నని ప్లాస్టిక్ తాడు మెడకు తగలడంతో వాహనం అదుపుతప్పి కిందను పడిపోయాడు మెడకు గాయమైంది అదృష్టవశత్తు పెద్ద ప్రమాదమే తప్పింది ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా గ్రామాలలో రహదారులలో రోడ్లలో ఇలాంటి అడ్డంకులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుకుంటున్నారు


# ,స్వర్ణ ఆంధ్ర పి -4 కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం మార్చి 30 పెన్ పవర్.** కురుపాం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ( ఎంపీటీవో) కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్ ఎస్ఏపిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిర్వహించిన "జీరో పావర్టీ -- పి 4" కార్యక్రమం తొలి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కురుపాం ఎమ్మెల్యే ఎ ప్రభుత్వ విప్,తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న పి 4 ప్రోగ్రామ్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని తమ జీవన స్థాయిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 300 బంగారు కుటుంబాలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ,ఏఎంసి చైర్ పర్సన్ కద్రక కళావతి,స్పెషల్ ఆఫీసర్ దిలీప్ చక్రవర్తి,రాష్ట్ర నాటక రంగ డైరెక్టర్ అంబటి రాంబాబు,ఏఎంసి వైస్ చైర్మన్ గార గౌరీశంకర్,గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రమారావు, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు,గుమ్మలక్ష్మీపురం,కురుపాం,జయ్యమ్మవలస మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కె.వి.కొండయ్య,జోగి భుజంగరావు,మాజీ ఏఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్,మాజీ సమితి అధ్యక్షురాలు వెంపటాపు భారతి,తోటపల్లి దేవాలయం డైరెక్టర్ ఆరిక జానకి,ఎంపిడిఓలు,తహసీల్దార్లు,పలువురు అధికారులు,కూటమి నాయకులు,కార్యకర్తలు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పీజీఆర్ఎస్‌లో ప్రజా వినతుల పై వేగవంతమైన చర్యలు అవసరం జేసీ గొబ్బిళ్ల విద్యాధరి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 30 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎ స్)లో అందుతున్న వినతులకు సకాలంలో, నాణ్యమైన పరిష్కారం అందించాల్సిందిగా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆ ర్ఎస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీ లించి, తగిన చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఫిర్యాదులకు సరైన విధంగా ఎండార్స్ మెంట్ ఇచ్చి, బాధితులకు సంతృప్తికర పరిష్కా రం అందించేలా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వివిధ సమ స్యలపై ప్రజలు మొత్తం 294 వినతులు సమ ర్పించారు. వీటిలో రెవెన్యూ విభాగానికి చెందిన వి 50, జీవీఎంసీకి 69 వినతులు వచ్చాయి. మిగతా విభాగాలకు సంబంధించినవి 145 కా గా, పోలీస్ శాఖకు 30 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు కూడా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

## కొడిసింగి గ్రామంలో పీఎం జన్ మన్ గృహప్రవేశాలు






**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 30:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని కొడిసింగి గ్రామంలో గృహప్రవేశాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమం స్థానిక సర్పంచ్ వనపల కాసులమ్మ, ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు సారథ్యంలో జరిగింది. గృహ నిర్మాణ శాఖ ఏఈ పసుపులేటి లక్ష్మీ విమల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తమ కొత్త ఇళ్లలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మరియు పార్టీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పివిటిజీ ఆదిమ గిరిజనుల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని 'పీఎం జన్ మన్' పథకం ద్వారా గృహాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయని తెలిపారు. లబ్ధిదారులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చల్లంగి అచ్యుత్, గాబ్రియల్, వైసీపీ నాయకులు వనపల రాజేష్, లొంజా గణపతి, అరడ సత్తిబాబు, జోగిరాజు, గంగరాజు, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది సూరిబాబు, చిట్టి పడాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజల ఆరోగ్య రక్షణే ప్రధాన లక్ష్యం. బొత్స అనూష..



**చీపురుపల్లిపెన్ పవర్ మార్చి 30 ..** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రధాన ధ్యేయంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష అన్నారు. సోమవారం నాడు చీపురుపల్లి మండలం కర్లాం గ్రామంలో విజయనగరం జిల్లా వైస్సార్ పార్టీ పబ్లిసిటీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిభిరం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అనే సంకల్పంతో, గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తామని ఆమె వివరించారు.


విజయనగరం జిల్లా వైస్సార్ పార్టీ పబ్లిసిటీ వింగ్ ఆధ్వర్యంలో చీపురుపల్లి మండలం, కర్లాం గ్రామంలో రాగోలు జెమ్స్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్, బాణాన భాగ్యలక్ష్మి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు బాణాన రామరత్నం రమణ పర్యవేక్షణలో ఉచిత మెగా వైద్యశిభిరం నిర్వహించగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మారుమూల గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం చేరువైనప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సాధ్యమవుతుంది అని ,ఇటువంటి ఉచిత శిబిరాలు గ్రామీణ ప్రాంతం ప్రజలకు ఒక వరప్రదాయిని.గా నిలుస్తాయి అని నిస్వార్థంగా సేవలందిస్తున్న వైద్య సిబ్బంది కి ఆమె ప్రశంసించారు. వైద్య వృత్తి పట్ల తనకున్న అవగాహనతో ఆమె రోగుల అవసరాలను అడిగి తెలుసుకోవడం అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ హాస్పిటల్ డాక్టర్స్ వెంకటేష్ (జనరల్ మెడిసిన్ ), డాక్టర్ సాయి తేజ (కార్డియాలజిస్ట్ ), డాక్టర్ సునీల్ (ఆర్థో ) వారి పర్యవేక్షణలో ఈ శిబిరంలో అత్యాధునిక పరికరాలతో నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి డాక్టర్ అనూష చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జెమ్స్ ఆసుపత్రి నిపుణులైన వైద్యులు వివిధ విభాగాల్లో రోగులను పరీక్షించి తగిన సలహాలు సూచనలు అందజేశారు. ఈ వైద్య శిభిరం లో హార్ట్ కి సంబందించిన ఈసీజీ , 2డి ఏకో పరీక్షలు ఉచితంగా చేశారు , వైద్యశిభిరం లో గుండె సంబంధిత సమస్యలు, కేన్సర్ సమస్యలు,కంటి సంబందించిన సమస్యలు, స్రీల సంబంధిత సమస్యలు,కీళ్ళ సమస్యలు, మరియు అన్ని రకాల సాధారణ వ్యాధులకు పరీక్షలు డాక్టర్స్ చే ఉచితంగా తనిఖీలు నిర్వహించారు. ఈ వైద్య శిభిరంలో చూపించుకున్న పెషేంట్ లకు వైద్యుల సూచనలు మేరకు ఆపరేషన్ లు జెమ్స్ హాస్పటల్ రాగోలు (శ్రీకాకుళం)వారిచే ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులు అయిన వారికి ఉచితంగా ఆపరేషన్ లు చేయబడును అని పేషెంట్లకు వివరించారు.

ఈ శిబిరంలో సుమారు 450 మంది తనిఖీ లు నిర్వహించారు. ఈ శిబిరం ప్రారంభోత్సవంలో బొత్స అనూష తో జడ్పిటిసి సభ్యులు వలిరెడ్డి శిరీష, జిల్లా జనరల్ సెక్రటరీ ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు వల్లి రెడ్డి శ్రీనివాస నాయుడు, మాజీ జడ్పిటిసి సభ్యులు మీసాల వరాల నాయుడు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి శ్రీనివాస్, యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దన్నాన జనార్ధన, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు బెల్లాన త్రినాథ,సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, శ్రీనివాసరావు, బాణన రామరత్నం, రమణ, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్ ప్రభాత్ కుమార్ జేమ్స్ హాస్పిటల్ ఎం. సింహాచలం, ఏరియా మేనేజర్ ఎస్.రాంబాబు, పి ఆర్ ఓ. జి.అప్పలనాయుడు మండలంలోని వివిధ గ్రామాల ముఖ్య నాయకులు,సోషల్ మీడియా ప్రతినిధులు మరియు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని ఈ శిబిరాన్ని విజయవంతం చేశారు.

## ఉపాధి శ్రామికులకు ముఖ ఆధారిత రెండు పూటలా హాజరు తప్పనిసరి.....

**మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్**

**నాతవరం, పెన్ పవర్ మార్చి,30)** పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ సోమవారం ఉపాధి హామీ ఫీల్ అసిస్టెంట్లకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకనుండి రెండు పూటలా ముఖఅధారిత హాజరు తప్పనిసరిగా వేయాలని ఆయన అన్నారు ఏప్రిల్ ,1వ తేదీ నుండి నుండి పెద్ద ఎత్తున ఉపాధి పనులు చేపట్టాలని ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లతో స్వయంగా కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు కరువుకాలంలో అన్ని కుటుంబాలకు వంద రోజులు పని పూర్తి చేసుకోవాలని ఉపాధి శ్రామికులు వడ గాల్పులు తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం, సత్య శ్రీనివాస్ ఏపీవో డి, కొండాలజీ, ఈసీ రాధిక టెక్నికల్ అసిస్టెంట్ లు ప్రసాద్ అప్పారావు భవాని, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



## ఇచ్ఛాపురం ఎమ్మెల్యే పైమండి పడిన బొత్తాడ గౌరీ శంకర్.

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ గిరిజనులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి.



**గుమ్మలక్ష్మీపురం మార్చి 30 పెన్ పవర్.** గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రం లో గల స్థానిక సర్పంచ్,ఆదివాసి సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడ గౌరీశంకరరావు ఇచ్చాపురం నియోజకవర్గనికి చెందిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే. బెందాలం అశోక్ పై సోమవారం నాడుగౌరీ శంకర్ మండిపడ్డారు. ఈ సందర్భంగా పత్రిక విలేకరులతో మాట్లాడుతూ. మార్చి 26న ఇచ్చాపురం నియోజక వర్గానికి చెందిన ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ వద్దకు స్థానిక ఆదివాసీ సంఘాల నాయకులు వెళ్లి,బెంతు ఒరియా వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చితే కలిగే ప్రభావాలను వివరించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆవేశానికి లోనై,అక్కడున్న ఆదివాసీ నాయకులపై అనుచితంగా,అసభ్య పదజాలంతో మాట్లాడటం జరిగింది."బాస్టడ్" "బుర్ర ఉండి మాట్లాడుతున్నారా? "నువ్వు ఎవడివిరా? "తెలివితక్కువ" వంటి పరుష వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయం. ఒక ప్రజాప్రతినిధి నుండి ఇలాంటి వ్యాఖ్యలు రావడం చాలా బాధాకరం. ఇది గిరిజన సమాజం గౌరవాన్ని దెబ్బతీసే చర్యగా భావిస్తున్నాము. ఈ ఘటనపై గిరిజన సమాజం మొత్తం తీవ్ర ఆందోళన మరియు ఆవేదన వ్యక్తం చేస్తోంది అన్నారు. అందువల్ల,ఎమ్మెల్యే బెందాలం అశోక్ తక్షణమే గిరిజన సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదివాసి సర్పంచుల సంఘం తరపున డిమాండ్ చేస్తున్నాము. లేనిపక్షంలో,దీనిపై తదుపరి కార్యాచరణ ప్రకటించి,ప్రజాస్వామ్యపరమైన మార్గంలో ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉన్నాము. బొత్తాడ గౌరీ శంకర్ అన్నారు.

## నేడు సపర్ల వారపు సంత ఆశీలు వసూలుకు బహిరంగ వేలం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 30:** అల్లూరి సీతారామరాజు జిల్లా జి.కె.వీధి మండలం గాలికొండ గ్రామపంచాయతీ పరిధిలోని సప్పర్ల శనివారం వారపు సంత ఆశీలు వసూలు హక్కుల కోసం ఈ నెల 31న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కె. నాగ సత్యనారాయణ తెలిపారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ వేలం కార్యక్రమం గ్రామ సర్పంచ్ కె. బుజ్జిబాబు, ఎంపీటీసీ ఏ. బుజ్జిబాబు ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యక్తులు అదే రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు తమ టెండర్లను సమర్పించుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 3 గంటలకు అధికారికంగా వేలం పాట నిర్వహించబడుతుందని, పాల్గొనదలచిన వారు సమయానికి హాజరుకావాలని అధికారులు కోరారు.

## కేజీహెచ్‌లో ఆటిజం అవగాహన వారం ప్రారంభం

చిన్నారుల భవిష్యత్తుకు దారి చూపే కార్యక్రమాలు






**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 30 :** ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే ప్రపంచ ఆటిజం అవగాహన వారం సందర్భంగా విశాఖపట్నం లోని కింగ్ జార్జ్ హాస్పిటల్ లో ప్రత్యేక కార్యక్ర మాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మార్చి 30 నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగనున్న ఈ అవగాహన వారాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజ్ పిల్లల వైద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ఆటిజం ఉన్న పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక ప్రశ్న--స మాధాన సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా డాక్టర్లు డాక్టర్. ఎన్. ప్రసన్న కుమార్, డాక్టర్. ఎం. పవన లలిత తల్లిదండ్రుల సందే హాలను సమగ్రంగా పరిష్కరిస్తూ, పిల్లల సంర క్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్గనిర్దేశం చేశారు. అదనంగా, పీజీ వైద్యులకు ఆటిజంపై శిక్షణాత్మక ఉపన్యాసాలు అందించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన డా. బి.ఎస్. చక్రవ ర్తి, ఆటిజం లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించి, ప్రమాదంలో ఉన్న చిన్నారులను త్వరగా గుర్తిం చి, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లకు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపా ల్ డా. కె.వి.ఎస్.ఎం. సాంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి ప్రారంభించా రు. పిల్లల వైద్య విభాగం చేపట్టిన ఈ అవగాహ న కార్యక్రమాలను వారు అభినందిస్తూ, పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో భాగంగా ఆటిజం ఉన్న చిన్నారు లు రూపొందించిన చిత్రాలతో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలోడి ఈ ఐ సి ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. హారిక, డా. రాజీవ్, ప్రొఫెసర్లు డా. రత్నకు మారి, డా. చౌదరి బాబు, పీజీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్ మంగళవారం 31 మార్చ్ 2026


# కేజీహెచ్‌కు రోటరీ క్లబ్ నుంచి రూ 8 లక్షల ఆర్థోపెడిక్ పరికరాల వితరణ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 30 :** ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసే దిశ గా విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రికు రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ వారు రూ 8 లక్షల విలువైన ఆధునిక ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స పరికరాలను విరాళంగా అందజేశారు. ఈ పరికరాల వితరణ కార్యక్రమం సోమవారం ఆసుపత్రి ప్రాంగణంలో జరిగింది.ఆర్థోపెడిక్ విభాగం ఆపరేషన్ థియే టర్ కోసం అందించిన ఈ అత్యాధునిక పరికరా ల వల్ల సంక్లిష్ట శస్త్రచికిత్సలను మరింత ఖచ్చి తత్వంతో, వేగంగా మరియు సురక్షితంగా నిర్వహించే అవకాశం కలుగుతుందని వైద్యులు తెలిపారు. ముఖ్యంగా పేద రోగులకు నాణ్య మైన చికిత్స అందించడంలో ఈ వితరణ కీలక పాత్ర పోషించనుంది.ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షుడు రోటేరియన్ మంగ ళగిరి సుదర్శన్ స్వామి మాట్లాడుతూ, 'సర్వీస్ అబవ్ సెల్ఫ్' అనే తమ సంస్థ లక్ష్యానికి అనుగు ణంగా సమాజానికి సేవ చేయడం తమ బాధ్య తగా భావిస్తున్నామని చెప్పారు. ఈ పరికరాల ద్వారా శస్త్రచికిత్సల ఫలితాలు మెరుగుప డటంతో పాటు రోగుల నిరీక్షణ సమయం కూడా తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్య క్రమంలో క్లబ్ ప్రతినిధి కె. రామ్ ప్రసాద్ కూడా పాల్గొన్నారు.ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ టి. భవాని ప్రసాద్ మాట్లాడుతూ, సమయానికి అందిన ఈ పరికరాలు ఆపరేషన్ థియేటర్‌ను ఆధునీకరించడంలో కీలకంగా ఉపయోగపడతా యని తెలిపారు. వైద్యులు మెరుగైన క్లినికల్ ఫలితాలు సాధించేందుకు ఇవి సహకరిస్తాయని చెప్పారు.కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి రోటరీ క్లబ్ ప్రతినిధులను అభినందించా రు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ యూనిట్ ప్రొఫెసర్లు డా. చంద్రశేఖరం నాయుడు, డా. ఎస్. కిశోర్ బాబు, డా. జి. రజనీ కుమార్, అడ్మినిస్ట్రే టర్ బి.వి. రమణ, ఆర్.ఎమ్.ఓ డా. ఏ. రాజేష్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా. బి. కిరణ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.


# విద్యార్థులకు ప్రీ-వొకేషనల్ అవగాహన పర్యటన





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 30:** అల్లూరి సీతారామరాజు జిల్లా జి.కె.వీధి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లోని 6వ, 7వ, 8వ తరగతి విద్యార్థులకు ప్రీ-వొకేషనల్ విద్యపై అవగాహన కల్పించేందుకు చింతపల్లి ఆర్ఏఆర్ఎస్ కేంద్రానికి విద్యా పర్యటన నిర్వహించారు.ఈ పర్యటనలో భాగంగా విద్యార్థులు వ్యవసాయం, తోటల పెంపకం, ఆధునిక సాగు విధానాలపై నిపుణుల నుండి వివరాలు తెలుసుకున్నారు. వివిధ పంటల పెంపకం, నర్సరీల నిర్వహణ, విత్తనాల సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యక్షంగా పరిశీలించి ప్రాథమిక అవగాహన పొందారు. విద్యార్థుల్లో వృత్తి పరమైన నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు.భవిష్యత్తులో ఉపాధి అవకాశాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి పర్యటనలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.

# గ్రామ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం సమర్పణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 30:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం సంకాడ పంచాయతీకి చెందిన సంకాడ కొత్తూరు, కుమ్మరపల్లి గ్రామాల నివాసితులు తమ గ్రామ సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ గొర్లె వీర వెంకట్ మరియు సంకాడ పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు ఊలం ఈశ్వరులకు వినతి పత్రం సమర్పించారు. గ్రామస్తులు చెక్‌డాం నిర్మాణం కోసం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. చెక్‌డాం నిర్మాణం వల్ల సుమారు 300 ఎకరాలకు పంట సాగు సులభమవుతుందని, ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. అంతేకాదు, సంకాడ కొత్తూరు--కుమ్మరపల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణం, మట్టి రోడ్డు స్థానంలో సీసీ లేదా బీటీ రోడ్డు నిర్మాణంపై కృషి చేయాలని కూడా వినతి పత్రంలో సూచించారు.వినతి పత్రాన్ని స్వీకరించిన వీర వెంకట్, రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సుర్ల వీరేంద్ర, రామకృష్ణ,జయరాజ్ గ్రామస్తులు వంతల రామారావు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లాలో ప్రజా ఫిర్యాదుల వేదికకు 64 ఫిర్యాదులు స్వీకరణ



**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 30 :** స్థానిక అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ ప్రజల నుంచి మొత్తం 64 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను నేరుగా వినడం, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఫిర్యాదుల విభజనలో భూ తగాదాలు--31, కుటుంబ కలహాలు--2, మోసపూరిత వ్యవహారాలు--5, ఇతర సమస్యలు--26 ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 7 రోజుల్లోపు విచారణ పూర్తిచేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే చేపట్టిన చర్యలపై నివేదికలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని చెప్పారు. ఫిర్యాదుదారులతో వ్యక్తిగతంగా మాట్లాడిన ఎస్పీ, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. "ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడం పోలీసుల ప్రధాన బాధ్యత. పారదర్శకంగా, చట్టబద్ధంగా సమస్యలను పరిష్కరించడంలో అనకాపల్లి జిల్లా పోలీసులు ఎప్పుడూ కట్టుబడి ఉంటారు," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు సహా ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అనకాపల్లి పోలీస్ శాఖకు గర్వకారణం





- 14 మందికి డీజీపీ కమండేషన్ డిస్క్ అవార్డులు
- 3 సిల్వర్, 11 బ్రాంజ్ పతకాల ప్రదానం
- అంకితభావంతో సేవలందించిన పోలీసులకు గౌరవం

**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 30 :** పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ విశేష ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రదానం చేసే ప్రతిష్టాత్మక డీజీపీ కమండేషన్ డిస్క్ అవార్డులు--2025 ఈసారి అనకాపల్లి జిల్లాకు ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చాయి. జిల్లా పోలీస్ శాఖకు చెందిన మొత్తం 14 మంది అధికారులు మరియు సిబ్బంది ఈ అవార్డులకు ఎంపిక కావడం విశేషం. ఈ అవార్డులలో 3 సిల్వర్ డిస్క్‌లు, 11 బ్రాంజ్ డిస్క్‌లు ఉండటం గమనార్హం. విధుల్లో కృషి, నిబద్ధత, సామాజిక భద్రతలో చూపిన ప్రతిభ ఆధారంగా వీరిని ఎంపిక చేశారు.

సిల్వర్ డిస్క్ గ్రహీతలు :
ఎల్. అప్పారావు (పీసీ, సబ్బవరం) వై. నరసింహమూర్తి (పీసీ, కె.డి.పేట) కె. రమణ (పీసీ, మునగపాక)

బ్రాంజ్ డిస్క్ గ్రహీతలు :
వై. తారకేశ్వరరావు (ఎస్సై, కె.డి.పేట) బి. సురేష్ బాబు (ఎస్సై, ఐటి కోర్) బి. అప్పారావు (ఏఎస్సై, కొత్తకోట) బి. శ్రీనివాసరావు (హెడ్ కానిస్టేబుల్, సబ్బవరం) ఎం. హేమంత్ కుమార్ (హెడ్ కానిస్టేబుల్, డీసీఆర్‌బీ) ఎస్. వరాహబాబు (హెడ్ కానిస్టేబుల్, డీఎస్బీ) కె. చిరంజీవి (హెడ్ కానిస్టేబుల్, కె.డి.పేట) బి. సత్యనారాయణ (పీసీ, పరవాడ) బి. గోవిందరావు (పీసీ, ఐటి కోర్) పి.ఎస్.జి. పవన్ కుమార్ (పీసీ, పాయకరావుపేట) ఏ.ఎస్. కృష్ణమూర్తి (ఏఆర్ పీసీ, డీఏఆర్) ఎంపికయ్యారు.

ఎస్పీ చేతుల మీదుగా సత్కారం..

జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అవార్డు గ్రహీతలను అభినందించారు. ఐటి కోర్‌కు చెందిన ఎస్సై సురేష్ బాబు, పీసీలు గోవిందరావు, కృష్ణమూర్తి మరియు డీసీఆర్‌బీ హెడ్ కానిస్టేబుల్ హేమంత్ కుమార్‌లకు స్వయంగా పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ లక్షణామూర్తి, సైబర్ క్రైమ్ / సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, "పోలీస్ సిబ్బంది ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తూ వృత్తిపరమైన నైపుణ్యాలను ప్రదర్శించాలి. ఇలాంటి అవార్డులు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతాయి. భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మంది సిబ్బంది ఉత్తమ సేవలు అందించి జిల్లా పోలీస్ శాఖకు పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. ఈ అవార్డులు అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలవడమే కాకుండా, ఇతర సిబ్బందికి ప్రేరణగా నిలుస్తాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

# విశాఖ పశ్చిమలో ఘనంగా 'జీరో పోవర్టీ--పి4' తొలి వార్షికోత్సవం

## పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జీరో పోవర్టీ--పి4





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చి 30 :** పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జీరో పోవర్టీ--పి4' (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్షిప్) కార్యక్రమం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో తొలి వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. 52వ వార్డు ఉమియా భవన్ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్.నాయుడు (గణబాబు) ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని బంగారు కుటుంబాలకు అండగా నిలిచిన మార్గదర్శులను ఘనంగా సత్కరించారు. శ్రీ సత్యసాయి ట్రస్ట్, శంకర్ ఫౌండేషన్, వై.తిరుమలరావు వంటి సేవా సంస్థలు, వ్యక్తులు చేసిన విశేష సేవలను ప్రశంసిస్తూ ఎమ్మెల్యే గణబాబు ప్రశంసాపత్రాలు అందజేశారు.

**సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం..**

తిరుపతిలో రాష్ట్ర స్థాయిలో జరిగిన వేడుకల నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగాన్ని డిజిటల్ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్షంగా ప్రసారం చేశారు. మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ఆయన జరిపిన ముఖాముఖి కార్యక్రమం కూడా హాజరైన వారిని ఆకట్టుకుంది. నియోజకవర్గంలో ప్రగతి వివరాలు మొత్తం 9,282 బంగారు కుటుంబాలను గుర్తించగా, ఇప్పటివరకు 5,786 కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నట్లు వెల్లడించారు. అలాగే 851 మంది మార్గదర్శులు నమోదు చేసుకుని సేవలందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, ప్రతి నాయకుడు ఒక కుటుంబాన్ని దత్తత తీసుకుని సేవ చేయాలనే ఉద్దేశంతో 'మార్గదర్శి' ప్రోగ్రామ్ రూపొందించబడిందని చెప్పారు.

ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఒక కుటుంబానికి ప్రణాళిక ఎంత ముఖ్యమో, రాష్ట్ర అభివృద్ధికి కూడా అంతే అవసరమని ఆయన అన్నారు. గతంలో 'విజన్ 2020'పై విమర్శలు వచ్చినప్పటికీ, నేడు అభివృద్ధి ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర ఎట్ ది రేట్ ఆఫ్ 2047' లక్ష్యంతో ముందుకు సాగుతోందని, విశాఖపట్నం నగరాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. సమాజంలోని ఎగువ 10 శాతం మంది మార్గదర్శులుగా మారి, దిగువ 20 శాతం పేద కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి జె. మాధవి, జోనల్ కమిషనర్ హేమావతి, ఏపీ యుఎఫ్ఐడిసి డైరెక్టర్ అంగ ప్రశాంతి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మార్గదర్శులు మరియు బంగారు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లాలో భారీగా గంజాయి దగ్ధం

- మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు
- ఎన్సిబి-ఈగల్ సంయుక్త చర్యలు
- 1108 కిలోల గంజాయి శాస్త్రీయ విధానంలో నిర్వీర్యం






**అనకాపల్లి (పరవాడ), పెన్ పవర్, మార్చి 30 :** మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర సంస్థలు చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తున్నాయి. ఇందులో భాగంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మరియు రాష్ట్ర ఈగల్ విభాగం సంయుక్తంగా భారీ స్థాయిలో గంజాయి నిర్మూలన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నమోదైన ఐదు వేర్వేరు కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు 1108 కిలోల గంజాయిని శాస్త్రీయ పద్ధతిలో దగ్ధం చేశారు. ఈ కార్యక్రమం పరవాడ మండలంలోని తానం గ్రామంలో ఉన్న రామ్ కి ఫార్మాసిటీలోని అత్యాధునిక ఇన్సినరేషన్ ప్లాంట్‌లో జరిగింది.

ఈ దగ్ధ ప్రక్రియను ఎన్సిబి జోనల్ డైరెక్టర్ పంకజ కుమార్ ద్వివేది, సూపరింటెండెంట్ రాజన్ కుమార్ మరియు ఈగల్ ఎస్పీ నగేష్ బాబు ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, బహిరంగంగా కాల్చకుండా కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటించే ఇన్సినరేషన్ యంత్రం ద్వారా గంజాయిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఈ ప్రక్రియలో ఎన్సీబీ ఇన్‌స్పెక్టర్ కె.కిరణ్ బాబు, ఈగల్ విభాగం ఇన్‌స్పెక్టర్లు డాక్టర్ కళ్యాణి, ధనుంజయ నాయుడు మరియు అనకాపల్లి ఈగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రాష్ట్రంలో డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, యువతను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించేందుకు ఇటువంటి తనిఖీలు, దాడులు, నిర్మూలన చర్యలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. కోర్టు అనుమతులతో స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలను ఇదే విధంగా క్రమం తప్పకుండా ధ్వంసం చేస్తామని తెలిపారు.

# కార్గో హ్యాండ్లింగ్‌లో చరిత్ర సృష్టించిన విశాఖపట్నం పోర్ట్ అథారిటీ

**2025-26లో 90.29 మిలియన్ టన్నులతో కొత్త రికార్డు**





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 30 :** కార్గో హ్యాండ్లింగ్‌లో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కొత్త రికా ర్డు సృష్టించింది. ఈ సంవత్సరం మార్చి 28 నా టికి 90.29 మిలియన్ టన్నుల కార్గోను హ్యాం డిల్ చేసి విశాఖ పోర్ట్ మరో మైలురాయిని చేరుకున్నట్లు అధికారులు వెల్లడించారు.పోర్ట్ ద్వారా నిర్వహించిన ఈ భారీ కార్గోలో రాక్ ఫాస్ఫేట్, అల్యూమినియం పౌడర్, మెగ్నీషియం ఓర్, స్టీల్ ప్లేట్లు, గ్రానైట్ బ్లాక్స్, ఆయిల్ వంటి కీలక సరుకులు ప్రధానంగా ఉన్నాయని పేర్కొ న్నారు. ఎగుమతి, దిగుమతి కార్యకలాపాల కోసం ఈ సరుకులను రవాణా చేసే నౌకలు విశాఖ పోర్ట్‌ను అధికంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు.కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసి, ప్రగతి పథంలో ముందుకు దూసుకుపోతు న్నామని పోర్ట్ అధికారులు స్పష్టం చేశారు. పోర్ట్ యాజమాన్యం, అధికారులు, సిబ్బంది, కార్మికు ల సమిష్టి కృషి ఫలితంగానే ఈ ఘనత సాధ్య మైందని యాజమాన్యం పేర్కొంది. దేశంలో ప్రముఖ పోర్టులలో ఒకటైన విశాఖప ట్నం పోర్ట్ అథారిటీ, తన సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటూ రాబోయే రోజుల్లో ఇంకా పెద్ద లక్ష్యాలను సాధించేందుకు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు

# జీకేవీధి మండలంలో అర్జీదారుల కోసం అధికారుల పడిగాపులు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 30:**అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక “మీ కోసం” కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నప్పటికీ, అర్జీదారుల హాజరు లేకుండా అధికారులు నాలుగు వారాలుగా పడిగాపుల్లా ఎదురుచూస్తున్నారు.జిల్లా స్థాయిలో ప్రతి శుక్రవారం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలు ఏర్పాటు చేయబడతాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, నాయకులు, ప్రతినిధులు సమస్యలను వినతి పత్రాల రూపంలో సమర్పించి పరిష్కారం కోసం ఎదురుచూస్తారు. అయితే, రవాణా, సమయ సమస్యల వల్ల గ్రామస్థాయి ప్రజలు సమస్యలను సమర్పించడం కష్టమవుతుండటంతో జిల్లా కలెక్టర్ ప్రతి మండల కేంద్రంలో సోమవారం మండల స్థాయి అధికారులు ప్రజల అర్జీలను స్వీకరించాలని ఆదేశాలు జారీ చేశారు.గత నాలుగు వారాలుగా జీకేవీధి మండల కేంద్రంలో ఎంపీడీవో రమణబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. సోమవారం కూడా ఎంపీడీవో రమణబాబు,తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు, ఉపాధి హామీ పథకం ఏపీఓ రాంప్రసాద్,ఎఫ్ఎసి ఏపీఎం సత్య బాబు, పశు వైద్యాధికారి రమేష్, కార్యదర్శి బాలకృష్ణ, పంచాయతీరాజ్ శాఖ ఏఈ బాలు,మండల విద్యాశాఖ అధికారులు సహా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు అర్జీదారుల కోసం వేచి ఉన్నా, ఇప్పటివరకు ఒక్కరు కూడా అర్జీ సమర్పించలేదు.ఎంపీడీవో రమణబాబు మాట్లాడుతూ, “ప్రజల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఏర్పాటుచేసిన వేదికల్లో అర్జీలు సమర్పించి సద్వినియోగం చేసుకోవాలి” అని సూచించారు.





## పాముని మింగిన మరో పాము

★ మొండిగెడ్డలో ఆశ్చర్య ఘటన



గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 30:అల్లూరి సీతారామరాజు జిల్లాలో వింత, అరుదైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గూడెం కొత్తవీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ పరిధిలోని మొండిగెడ్డ గ్రామంలో స్థానికులు ఎర్రజెర్రిపోతుగా పిలిచే నాగుపామును మరో పాము మింగిన సందర్భాన్ని గుర్తించారు. సాధారణంగా పాములు ఇతర జాతుల ప్రాణులను మాత్రమే తింటాయి. కప్పలు, మేకలు, జంతువులను మింగిన సందర్భాలు ఉండగా, ఒక పాము మిగతా పామును మింగడం అరుదుగా జరుగుతుంది. ఈ ఘటన స్థానికులను భయాందోళనకు గురి చేసింది. స్థానికులు వెంటనే ఆ పాముని హతమార్చారు. స్థానికులు ఈ ఘటనను అతి అరుదైనగా పేర్కొన్నారు.

## విజ్ఞాన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామం





**కూర్మన్నపాలెం :పెన్ పవర్ , మార్చి 30**
విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ దువ్వాడ, విశాఖపట్నం, లోని సీఎస్ఈ -- డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పై సమగ్ర వర్క్‌షాప్‌ను మార్చి 02 నుండి 28, 2026 వరకు విజయవంతంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆకాష్ ఎటి, ఐఈఎస్ -- ఏపీఎంఎస్ఎంఈ ని సాదరంగా ఆహ్వానించారు. తన ప్రసంగాల్లో ఆయన నేటి పోటీ ప్రపంచంలో వ్యాపార దృక్పథం, ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు కొత్త అవకాశాలను అన్వేషించి, సమస్యలను పరిష్కరించే దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.
ఈ వర్క్‌షాప్ విద్యార్థుల అకడమిక్ జ్ఞానం మరియు పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే విధంగా రూపొందించబడింది. ఇందులో స్టార్టప్ ఐడియేషన్, బిజినెస్ ప్లానింగ్, ఫైనాన్షియల్ లిటరసీ, లీడర్‌షిప్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రస్తుత పరిశ్రమ ధోరణులు వంటి అంశాలపై విశదీకరణ ఇచ్చారు. సెషన్లు చురుకుగా, ఆసక్తికరంగా నిర్వహించబడడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మరియు కెరీర్ అభివృద్ధిపై విలువైన అవగాహనను పొందారు. ఈ వర్క్‌షాప్ వారి సృజనాత్మకతను పెంపొందించడంలో మరియు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలకు సిద్ధం చేయడంలో ముఖ్య పాత్ర పోషించింది.
ఈ కార్యక్రమాన్ని కె. దివ్య కళ్యాణి సమర్థవంతంగా సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్ , రెక్టర్ డా. వి. మధుసూదన రావు , మరియు సీఎస్ఈ -- డేటా సైన్స్ విభాగాధిపతి డా. వై. సాలిని ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి ప్రయోజనకరమైన కార్యక్రమాలను నిర్వహించిన నిర్వాహక బృందాన్ని ప్రశంసించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

## డాక్టర్ వంపూరు గంగులయ్యని కలిసిన గ్రంథాలయ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, మార్చి 30:**ఆంధ్రప్రదేశ్ జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మన్, జనసేన జిల్లా ఇంచార్జీ డాక్టర్ వంపూరు గంగులయ్య ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ పాడేరు కేంద్రంలోని జనసేన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గంగులయ్యకు అభినందనలు తెలియజేస్తూ పుష్పగుచ్చం అందజేసి ఘనంగా సన్మానించారు. తొలిసారిగా పాడేరు వెళ్లిన చైర్మన్ సతీష్ ను గంగులయ్య ఘన స్వాగతంతో సత్కరించారు.ఈ సమావేశం పాడేరు ప్రాంతంలో జరగనున్న అల్లూరి సీతారామరాజు జిల్లా రివ్యూ కమిటీ సమావేశానికి ముందు జరిగింది. ఈ సందర్భంలో అధికారిక ఆతిథ్యం, పరస్పర మర్యాదతో సమావేశం ఘనంగా ముగిసింది.

## మహిళపై దాడి కేసు నమోదు..

**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 30 ..** చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి గ్రామంలో జరిగిన కొట్లాట కేసులో బాధితురాలు చందక భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీపురుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామంలోని రహదారి పైన కావిడ పట్టుకుని వెళుతున్న శ్రీనివాస్ రావు అనే వ్యక్తి రోడ్డుకి అడ్డంగా ఉన్న మోటార్ సైకిల్ తీయమని అడిగినందుకు గ్రామానికి చెందిన జయంతి రావు అనే వ్యక్తి గొడవపడి ఆయనపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో కర్రతో దాడి చేస్తున్న నేపథ్యంలో తన భర్తను రక్షించడానికి చందకు భవాని అనే మహిళ అడ్డుపడడంతో ఆమెకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు అందజేస్తున్నారు. ఈ మేరకు చీపురుపల్లి ఏఎస్ఐ శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 75 వార్డ్ ఎస్ సి కాలనీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక :పల్లా



**గాజువాక :పెన్ పవర్ ,మార్చి 30** జీవీఎంసీ 75వ వార్డ్, ఎస్సి కాలనీ సీతానగరం , నెల్లిముక్కు గ్రామాల్లో ఉన్న సంఘాల ఆహ్వానం మేరకు రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్, విశాఖ జిల్లా తెలుగుయువత ప్రధానకార్యదర్శి మొల్లి పెంటిరాజు పర్యటించారు.
ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలను పరిశీలించి గ్రామ సంఘాల అభ్యర్థన మేరకు చిల్డ్రన్ పార్కు , ఓపెన్ జిమ్ , కాంపౌండ్ వాల్ మర్మతులు చేపట్టాలని కోరారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలో ఎస్సి కాలనీ అభివృద్ధికి, వారి సంక్షేమం కోసం గాజువాక ఎం ఎల్ ఏ పల్లా శ్రీనివాసరావు, కూటమి ప్రభుత్వం ఎన్నిక హామీలో భాగంగా ప్రత్యేక ప్రణాళిక, నిధులను కేటాయింపులు చేసి, ఆయా ప్రాంతాల అభివృద్ధి కి కట్టుబడి ఉన్నామని, ఎస్సి కాలనీల అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు.
ఈ కార్యక్రమంలో 75వ వార్డ్ అధ్యక్షుడు నమ్మి అప్పారావు, ప్రధానకార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, క్లస్టర్ ఇంచార్జ్ ఉరుకూటి అప్పలరాజు, గాజువాక నియోజకవర్గం ఎస్సి సెల్ అధ్యక్షుడు వంగలపూడి అప్పలరాజు, టేకేటి అప్పలరాజు, సీనియర్ నాయకులు టెకేటి పెంటయ్య, కణితి మహేష్, కణితి సురేష్, ప్రసాద్, పెద్దాడ అప్పన్న ప్రసాద్, టేకేటి నర్సింగ్ రావు , ఎలబిల్లీ అప్పల రాజు, టేకేటి అప్పారావు, కణితి రాజేంద్ర ప్రసాద్, పెద్దాడ సత్యనారాయణ, శివాటి రమేషే, పెద్దాడ నాగేష్, టేకేటి నూకరాజు,టేకేటి వెంకట ప్రసాద్, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం జన్ మన్ గృహాలకు అదనపు నిధులు విడుదలకు డిమాండ్

ఎంపీపీ బోయిన కుమారి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 30**:పివిటిజీ ఆదిమ జాతి గిరిజనులకు నిర్మిస్తున్న పీఎం జన్ మన్ గృహాలకు ప్రభుత్వం హామీ ఇచ్చిన అదనపు నిధులు తక్షణమే విడుదల చేయాలని ఎంపీపీ బోయిన కుమారి డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం వంచుల పంచాయతీ
కోడిసింగి గ్రామంలో గృహప్రవేశాల సందర్భంలో మీడియాతో మాట్లాడిన ఎంపీపీ బోయిన కుమారి, పీఎం జాన్ మాన్ గృహాలకు అదనంగా లక్ష రూపాయలు, గిరిజనులు నిర్మించుకుంటున్న పీఎం ఏ వై గృహాలకు 75,000 రూపాయల అదనపు నగదు ఇప్పటికీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. గృహ నిర్మాణ ఖర్చులు పెరగటంతో లబ్ధిదారులు అప్పులు తీసుకుని గృహాలను నిర్మించుకుంటున్నారని పేర్కొన్నారు.కావున ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే అదనపు నగదు విడుదల చేసి, లబ్ధిదారులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గృహ నిర్మాణాలను పూర్తి చేయగలరు అని ఎంపీపీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వంచుల సర్పంచ్ వనపల కాసులమ్మ, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టూరిజం పేరుతో దోపిడీ ఆపాలి

✷ మారేడుమిల్లి--చింతలపూడి రహదారి నాణ్యతపై విచారణ కు డిమాండ్
✷ సిపిఎం డిమాండ్



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 30 :** మారేడుమిల్లి మండలంలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న టూరిజం వల్ల సాధారణ ప్రజలకు ప్రయోజనం కంటే ఇబ్బందులే ఎక్కువగా ఉన్నాయని సీపీఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ నాయకులు మట్ల. వాణిశ్రీ, ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి ఆరోపించారు.మండలంలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, చికెన్ తదితరాలు మైదాన ప్రాంతాలతో పోలిస్తే అధిక ధరలకు విక్రయిస్తున్నారని వారు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారని విమర్శించారు. టూరిజాన్ని అడ్డుగా పెట్టుకొని గిరిజన ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అందువల్ల సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రతి వ్యాపార స్థావరాన్ని పరిశీలించి అధిక ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం జరిగేలా కఠిన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.ఇక మారేడుమిల్లి నుంచి చింతలపూడి వరకు నిర్మాణంలో ఉన్న రహదారి పనుల్లో నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తోందని వారు ఆరోపించారు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా పనులు నిర్వహిస్తున్నారని, నాసిరకం పనులను సహించబోమని హెచ్చరించారు.రోడ్డు పనులపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి నాణ్యతను నిర్ధారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు.

# పేదల 'సొంతింటి' కల సాకారం





- రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల గృహ ప్రవేశాలు
- రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 30:** పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. సోమవారం రంపచోడవరం మండలం భీరంపల్లి గ్రామంలో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండో విడతలో భాగంగా ఏకకాలంలో 2.5 లక్షల గృహ ప్రవేశాలను నిర్వహించడం ద్వారా పేదలకు ఇళ్ల కలను నిజం చేస్తున్నామని పేర్కొన్నారు. పోలవరం జిల్లా వ్యాప్తంగా పీఎం-జన్ మన్ పథకం కింద 367 గృహాలు, పీఎం-ఏవై కింద 24 గృహాలు కలిపి మొత్తం 391 గృహాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిరీషాదేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డి, ఐటిడిఏ పీవో బచ్చు స్మరణ రాజు సంయుక్తంగా ప్రారంభించారు. లబ్ధిదారులతో మాట్లాడిన ఆమె వారి ఆనందాన్ని ప్రత్యక్షంగా చూసినట్లు తెలిపారు.

**21 నెలల్లో 5.50 లక్షల ఇళ్లు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలల్లోనే మొత్తం 5.50 లక్షల ఇళ్లను పేదలకు అందజేసిన ఘనత సాధించిందని ఎమ్మెల్యే తెలిపారు. గత సంవత్సరం నవంబర్‌లో 3 లక్షల ఇళ్లను అందించగా, ఇప్పుడు రెండో విడతలో భాగంగా 1 లక్ష టిడ్కో ఇళు,, 1.50 లక్షల గృహాలను లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతిల్లు అందే వరకు కృషి కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి, ఐటిడిఏ పీవో బచ్చు స్మరణ రాజు, క్లస్టర్ ఇంచార్జి కారం సింహాచలం, సర్పంచ్ నూకరాజు, పూల మంగేశ్వరరావు, కారం వెంకటేశ్వర్లు, కోసు నాగన్నదొర, చోడి నూకరాజు, కూర రమణమ్మ, బాపన్న దొర, ఈకా బుల్లి కొండలు దొర, కుర్ల రాజశేఖర్ రెడ్డి, వినోద్, కేఎల్ఎస్జీ వరప్రసాద్, గృహ నిర్మాణ శాఖ ఈఈ ఏ. రవికుమార్, డీఈ శ్రీరామచంద్రమూర్తి, ఏఈ బి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పేదగిరిజన కుటుంబాన్ని ఆదుకోండి



- వై.సి.పి.యూత్,నాయకులు సోడిచిరంజీవి

**వి.ఆర్.పురం పెన్.పవర్.మార్చి.30:** మండలంలోని కొత్తూరు గ్రామానికిచెందిన కెచ్చల భీమి రెడ్డి కుమార్తె,ఆడుకొనుచుండగా ప్రమాదవుశాత్తు కింద పడిపోవడంతోనడుము విరిగిపోవడం జరిగిందని,వై.సి. పి.యూత్,నాయకులు తెలిపారు.ఈవిషయం తెలుసు కున్న వై.సి.పి.యూత్,నాయకులు సోడిచిరంజీవి సోమ వారం కెచ్చల భీమిరెడ్డి,కుటుంబానికి వెయ్యి రూపాయలు ఆర్థికసహయం చేశారు.ఈ సమస్యను గ్రూపులో పెట్టిన వెంటనే స్పందించిన ఇద్దరు ధాతలు కర్నూలు నుండి ఒకరు,కలమాల హేమంత్,హుసేన్,అయిదు వందల రూపాయలు,మైలవరం నియోజకవర్గం నుండినాటూరి వెంకట్,వై.సి.పి.పార్టీ బి.సి.సెల్,సెక్రటరీ,కూడాఅయిదు వందలరూపాయలు సోడిచిరంజీవి,పోన్,పేకువేసి ఆకు టుంబానికి అందజేయమని,కోరారు.కెచ్చల భీమిరెడ్డి,కు సంతానం నలుగురు,అందరూ చిన్న పిల్లలు కావడంతో ఒక్కరేకూలి పనులుచేసి, ఆకుటుంబాన్ని,పోషించు కుటుం న్నాడు.ఇలాంటి సమయంలో ఆకుటుంబానికి ఇలా జరగ డం చాలా బాదాకరం విషయం అంటూ పలువురు ఆరో పిస్తున్నారు.కెచ్చల భీమిరెడ్డి,కుటుంబాన్ని,ఏడు సంవత్స రాల వయస్సుగల పాపను,ధాతలు ఎవరైనా ఉంటే ఆర్థిక సహయంచేసి,ఆదుకోవాలని,వి.ఆర్.పురం వై.సి.పి.యూ త్,నాయకులు సోడిచిరంజీవి,కోరారు.మానవతా దృక్ప థంతో ఆర్థిక సహాయం చేయండి.పేదగిరిజన కుటుంబాన్ని ఆదుకోండి,అంటూ ఒక ప్రకటనలో తెలిపారు.ఆర్థిక సహా యం చేసేవారు,సోడిచిరంజీవి పోన్,పే,నెంబర్,కు నగదు వేయండి.ఆ కుటుంబానికి అందజేయడం జరగుతుంది. 950285 1486

# ఎమ్మెల్యే బెందళం అశోక్‌పై అట్రాసిటీ కేసు పెట్టాలంటూ ఆదివాసి జేఏసీ డిమాండ్



**చింతూరు, పెన్ పవర్ మార్చి 30:** చింతూరు డివిజన్ కేంద్రంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందళం అశోక్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సమస్యలను వివరించేందుకు ఎమ్మెల్యేను కలిసిన ఆదివాసి నాయకులను అవమానకరంగా దూషించడం ప్రజాప్రతినిధికి తగిన చర్య కాదని విమర్శించారు. వెంటనే ఆయనను ప్రభుత్వ విప్ పదవి నుండి తొలగించాలని కోరారు. అలాగే, ఒడిశా రాష్ట్రం నుండి వలస వచ్చిన కొంతమంది నాన్ ట్రైబల్స్‌ను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే నకిలీ సర్టిఫికెట్లతో కొందరు ఎస్టీగా చలామణి అవుతున్నారని, దీనివల్ల అసలైన ఆదివాసీల హక్కులు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే తన అధికారాన్ని దుర్వినియోగం చేసి వేలాది నాన్ ట్రైబల్స్‌ను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ, వెంటనే ఆయనపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చింతూరు మండల జేఏసీ చైర్మన్ పొడియం రామకృష్ణ, డివిజన్ ప్రచార కార్యదర్శి సోడి శ్రీను, కాకా సీతారామరయ్య, మడివి రాజు, గోరేం రాఘవ, మడకం బోజ్జి, మడకం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రంప యర్రంపాలెం గ్రామంలో పలు కుటుంబాలకు "కంబాల" చేయూత

40,000 రూపాయలు ఆర్థిక సహాయం, 200 కిలోల బియ్యం పంపిణీ



**గోకవరం పెన్ పవర్ మార్చి 30:--** మండలంలోని రంపయర్రం పాలెం గ్రామంలో పలు కుటుంబాలను విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు గారు చేయూత అందించి ఆదుకున్నారు. గ్రామానికి చెందిన రాకుదిటి లక్ష్మీ నారాయణ ఒక ప్రమాదంలో కాలు విరిగిపోయింది. అతనికి కంబాల శ్రీనివాసరావు 5,000 రూపాయలు, 25 కిలోలు బియ్యం ఇచ్చి అధైర్య పడద్దని భరోసా ఇచ్చారు. అలాగే తులసి సత్యనారాయణ భార్య వీర లక్ష్మీ ఇటీవలే చని పోయింది. అతని కుటుంబ సభ్యులకు 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యం అందజేశారు.

బొల్లం వెంకటలక్ష్మి టీవి వ్యాధితో బాధపడుతుంది. ఆమెకు 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యం అందజేశారు. పోలుమాటి రాణి భర్త దుర్గారావు ఇటీవలే మృతి చెందాడు. ఆమె కుటుంబానికి 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈరెళ్ల అశ్విని కుమారుడికి రెండు చెవులు లేవు అతినికి 5,000 రూపాయలు, 25 కీలోల బియ్యం అందజేశారు. యడారి వెంకాయమ్మ ఇటీవలే మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులకు 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యంఇచ్చారు. అంకం భర్తయ్య పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. అతినికి 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యం అందించారు. గుర్రం జ్యోతి గర్భవతి ఆమెకు బంధువులు ఎవరూ లేరు. ఒంటరిగా జీవిస్తుంది. ఆమెకు 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యాన్ని కంబాల శ్రీనివాసరావు అందజేసి ఆదుకున్నారు.

వీరందరికీ సోమవారం సాయంత్రం గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను రామసేన సభ్యులు పరామర్శించి, కంబాల శ్రీనివాసరావు ప్రకటించిన నగదు బియ్యాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమం లో కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, పెద్దాడ వెంకన్న దొర, కాళ్ళ బుజ్జి, గంటా రాధాకృష్ణ, బత్తిన రామకృష్ణ, కాకర దుర్గారావు, కత్తుల వెంకటేశులు కత్తుల చంటిబాబు ఇచ్చిన నరేంద్ర గ్రామస్తులు, రామసేన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చట్టి గ్రామపంచాయతీలో చివరి పాలకవర్గ సమావేశం

సభ్యులకు సన్మానం




**చింతూరు పెన్ పవర్ మార్చి 30:** చట్టి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం గ్రామ సర్పంచ్ రవ్వ భద్రమ్మ అధ్యక్షతన చివరి పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచ్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులకు చిరు సన్మానం చేశారు. అనంతరం వార్డు సభ్యులు, పెసా కమిటీ సభ్యులు కలిసి సర్పంచ్ రవ్వ భద్రమ్మను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవ్వ భద్రమ్మ మాట్లాడుతూ గత ఐదేళ్లలో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. నిధుల లభ్యతను బట్టి 2026, 27 గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో కొన్ని సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించామని, అవి వచ్చే ఆర్థిక సంవత్సరంలో పరిష్కారమవుతాయని వెల్లడించారు. ఉప సర్పంచ్ తుర్రం రాముడు మాట్లాడుతూ పదవీకాలం పూర్తయినప్పటికీ వార్డు సభ్యులు తమ తమ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి కొనసాగించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ అలీ గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పెసా కమిటీ ఉపాధ్యక్షులు తుర్రం చిన ముత్తయ్య, కార్యదర్శి పొడియం రామకృష్ణ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామ సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు, పెసా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నీరుకొండ వీరన్న చౌదరికి చిరు సత్కారం..

- పి ఫోర్ టీం మరియు ఎమ్మెల్యే బత్తుల ఆధ్వర్యంలో ..



**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 30:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పి ఫోర్ పెట్టిన సందర్భంగా నీరుకొండ వీరన్న చౌదరికి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మరియు నియోజకవర్గ అధికారులు మండల మరియు పి ఫోర్ టీమ్ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరికి పి ఫోర్ స్ఫూర్తితో వెదుళ్ళపల్లి స్కూలుకి వారి కుటుంబ సభ్యులతో మండలంలో స్కూల్స్ కి భవన నిర్మాణము మరియు భోజనశాలకు,కాంపౌడ్,వాల్ కు సొంత నిధులు ఇచ్చినందుకు నీరుకొండ వీరన్న చౌదరికి చిరు సత్కారం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు వీరన్న చౌదరిని అభినందించారు.

## పశువుల సంత, రోజువారీ మార్కెట్ వేలంపాటలు నిర్వహణ



**చింతూరు పెన్ పవర్ మార్చి 30:** చట్టి గ్రామపంచాయతీలో సర్పంచ్ రవ్వ భద్రమ్మ అధ్యక్షతన వారాంతపు పశువుల సంత (మేకల సంత) మరియు రోజువారీ మార్కెట్ ఆసిల్‌కు సంబంధించిన బహిరంగ వేలంపాటలు సోమవారం నిర్వహించారు. వారాంతపు పశువుల సంత వేలంపాటలో గ్రామపంచాయతీ నిర్ణయించిన ప్రారంభ ధర రూ.60 వేలుగా ఉండగా, వేలంలో పాల్గొన్న వారి పోటీలో సంవత్సరానికి మొత్తం రూ.84,700కు చట్టి గ్రామానికి చెందిన రవ్వ వీరేంద్ర దక్కించుకున్నారు. అలాగే, గ్రామపంచాయతీ పరిధిలో రోజువారీ వ్యాపార నిమిత్తం వచ్చే వాహనాలపై మార్కెట్ ఆసిల్ వసూలు హక్కుల కోసం నిర్వహించిన వేలంపాటలో ప్రారంభ ధర రూ.20 వేలుగా నిర్ణయించారు. ఈ వేలంలో తుర్రం నీలయ్య సంవత్సరానికి రూ.50 వేల రూపాయలకు హక్కులను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు డిప్యూటీ ఎంపీడీవో ఆర్. వీర్రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ మహమ్మద్ అలీ, పెసా కమిటీ సభ్యులు తుర్రం చిన్న ముత్తయ్య, పొడియం రామకృష్ణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రంపచోడవరం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 30:** రంపచోడవరం నూతన బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. న్యాయవాదుల సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా మాదే బాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఏలూరి పాపారావు, జనరల్ సెక్రటరీగా శివరంజని, జాయింట్ కార్యదర్శిగా రవితేజ, ట్రెజరర్ గా .గౌరీ శంకర్, మహిళ ప్రతినిధిగా వి. చక్రికా సభ్యులతో కూడిన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీకి న్యాయవాదులు శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం రంపచోడవరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మురళి గంగాధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, న్యాయవాదుల సమస్యలు మరియు పోలవరం జిల్లాలోని పలు న్యాయ సంబంధిత అంశాలపై చర్చించారు.

న్యాయవాదుల ఐక్యతకు ఈ ఎన్నికలు నిదర్శనంగా నిలిచాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంవి ఆర్ ప్రకాష్, మరి బాబ్జి, జిలాని, ప్రభుదాస్, కోలా సత్యప్రసాద్, శ్రీధర్, రమణ, దత్తు న్యాయవాదులు పాల్గొన్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com